
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విశాఖపట్నం
జిల్లా వార్తలు
శుక్రవారం 26 సెప్టెంబరు 2025



అంపశయ్యపై ఏయూ హెల్త్ సెంటర్

ఉన్నది ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు

- గతంలో నలుగురు డాక్టర్లు, నలుగురు నర్సులు...
- ప్రస్తుతం రిటైరైన డాక్టర్‌తోనే కాలక్షేపం
- కనీస సౌకర్యాలు మృగ్యం
- ఇదీ ఏయూ హెల్త్ సెంటర్ దుస్థితి



ఏయూ హెల్త్ సెంటర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

వందేళ్ల చరిత్ర కలిగిన ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇటీవల తరచూ వివాదాల్లోకి ఎక్కుతోంది. విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడమే అందుకు కారణంగా మారుతోంది. ప్రస్తుతానికి వస్తే...గురువారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థి ఒకరు మృతిచెందారు. యూనివర్సిటీకి చెందిన హెల్త్ సెంటర్‌లో కనీస సదుపాయాలు లేకపోవడం వల్లనే విద్యార్థి మృతిచెందాడంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు.

యూనివర్సిటీ హెల్త్ సెంటర్

యూనివర్సిటీలో దాదాపు 20 వేల మంది విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ కలిసి మరో 2,500 మంది ఉంటారు. వీరిలో ఎవరికి ఏ అనారోగ్యం కలిగినా క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు వెళ్లాల్సిందే. అక్కడ ఇంతకు ముందు నలుగురు డాక్టర్లు, నలుగురు స్టాఫ్ నర్సులు, వార్డు బాయ్‌లు ఉండేవారు. ఇప్పుడు ఒకే ఒక డాక్టర్ ఉన్నారు. ఆయన కూడా పదవీ విరమణ చేయగా, కొనసాగిస్తున్నారు. స్టాఫ్ నర్స్ కూడా ఒక్కరే ఉన్నారు. సాయంత్రం ఆరు గంటలు దాటితే అక్కడ వైద్యం అందదు. ఆస్పత్రికి అంబులెన్స్ ఉంది. దానికి డ్రైవర్ కమ్ వార్డ్ బాయ్‌గా ఒకరే పనిచేస్తున్నారు. తాను 24/7 విద్యార్థులకు అందుబాటులో ఉండాలంటే క్వార్టర్‌లో ఉండాలని, దానికి మరమ్మతులు చేయాలని డాక్టర్ కోరారు. ఈ మేరకు అధికారులు వీసీకి ఫైల్ పెడితే...రిటైరైన డాక్టర్ కోసం క్వార్టర్‌కు మరమ్మతులు ఎందుకంటూ పక్కనపెట్టేశారు. కనీసం సిబ్బందిని అయినా నియమించాలని ఫైల్ పెడితే దానిని కూడా పరిశీలించలేదు. ప్రస్తుతం ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్సు, ఒక డ్రైవర్‌తో హెల్త్ సెంటర్ నడుస్తోంది. ఇది ప్రాథమిక చికిత్స అందించేందుకే నిర్వహిస్తున్నా...అది కూడా అందడం లేదు. ఆఖరుకు ఆక్సిజన్ కూడా లేకుండా చేశారు.

ఇద్దరు ప్రాణాలు కాపాడుకున్నారు

పదిహేను రోజుల క్రితం ఫార్మసీకి చెందిన ఓ విద్యార్థినికి ఊపిరి అందని పరిస్థితి ఎదురైతే తోటి విద్యార్థులు హెల్త్ సెంటర్‌కు తీసుకు వెళ్లారు. అక్కడ ఆక్సిజన్ లేదని తెలిసి వెంటనే విమ్స్‌కు తరలించారు. దాంతో ఆమె బతికి బయటపడింది. అదేవిధంగా పొలిటికల్ సైన్స్‌కు చెందిన మరో విద్యార్థిని నీరసంగా ఉందని వెళితే...జ్వరమని తేల్చి మందులు ఇచ్చారు. వారం రోజులైనా తగ్గకపోవడంతో ఆమె బయట పరీక్షలు చేయించుకోగా డెంగీ ఫీవర్ అని, అప్పటికే ప్లేట్‌లెట్లు పడిపోయాయని వైద్యులు తెలిపారు. దాంతో ఆమె వెంటనే చికిత్స తీసుకోవడంతో ప్రాణాలు దక్కాయి.

ఏయూలో ఉద్రిక్తత

హాస్టల్ విద్యార్థి మృతి

- సకాలంలో చికిత్స అందకపోవడమే కారణమని విద్యార్థి సంఘాల ఆందోళన
- వర్సిటీ డిస్పెన్సరీలో సమస్యలను గతంలో వీసీ దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని ఆరోపణ
- ప్రధాన ద్వారం ఎదుట బైఠాయింపు
- అనంతరం వీసీ చాంబర్‌లోకి దూసుకువెళ్లిన విద్యార్థులు
- వైస్ చాన్సలర్‌కు రక్షణకు నిలిచిన ప్రొఫెసర్లు, సిబ్బంది
- వీసీ రాజీనామా చేయాలని విద్యార్థుల డిమాండ్
- నేడు బంద్‌కు పిలుపు


మృతిచెందిన విద్యార్థి వింజమూరి వెంకట సాయి మణికంఠ (ఫైల్)


క్యాంపస్‌లో సమస్యలపై వీసీ రాజశేఖర్‌ను ప్రశ్నిస్తున్న విద్యార్థులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థి ఒకరు గురువారం ఉదయం సకాలంలో వైద్యం అందకపోవడంతో మృతిచెందారు. దీనిపై విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమ సమస్యలు పట్టించుకోని వైస్ చాన్సలర్ రాజీనామా చేయాలంటూ ఆయన ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. ఈ తరుణంలో వీసీకి ప్రొఫెసర్లు, సిబ్బంది రక్షణగా నిలిచారు. కాగా, శుక్రవారం యూనివర్సిటీ బంద్ చేయాలని విద్యార్థి సంఘ నాయకులు పిలుపునిచ్చారు.

బ్రష్ చేయడానికి వెళ్లి పడిపోయాడు

విజయనగరానికి చెందిన వింజమూరి వెంకట సాయి మణికంఠ (25) యూనివర్సిటీలో బీఈడీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. క్యాంపస్‌లోని శాతవాహన హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో తండ్రి శ్రీనివాసరావుకు ఫోన్ చేసి మాట్లాడాడు. ఆ తరువాత మిత్రులతోను సంభాషించాడు. 7.30 గంటల ప్రాంతంలో బ్రష్ చేసుకోవడానికి వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడ జారి పడిపోయాడు. ఊపిరి అందక గిలగిలలాడాడు. ఈ విషయం గుర్తించిన తోటి విద్యార్థులు వెంటనే యూనివర్సిటీ ఆవరణలో ఉన్న డిస్పెన్సరీకి ఫోన్ చేసి అంబులెన్స్‌ను రప్పించారు. అందులో డ్రైవర్ తప్ప సహాయక సిబ్బంది ఎవరూ లేరు. తనకు ఊపిరి ఆడడం లేదని, ఆక్సిజన్ పెట్టాలని మణికంఠ కోరాడు. అయితే అంబులెన్స్‌లో ఆ ఏర్పాట్లు లేకపోవడంతో అక్కడి నుంచి కింగ్ జార్జి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ మణికంఠకు వైద్యాధికారులు ప్రాథమిక చికిత్స అందించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే అతను మరణించినట్టు గుర్తించి, అదే విషయం మిత్రులకు తెలియజేశారు. వెంటనే ఆక్సిజన్ పెట్టి ఉంటే చనిపోయేవాడు కాదని తెలిపారు. వెంటనే వారు విజయనగరంలోని మణికంఠ తండ్రి శ్రీనివాసరావుకు విషయం తెలియజేసి రప్పించారు.


వీసీ ఛాంబర్‌లోకి దూసుకువెళుతున్న విద్యార్థులు

వీసీ కార్యాలయం ఎదుట ఆందోళన

మణికంఠ ఆక్సిజన్ అందకే చనిపోయాడని వైద్యులు చెప్పడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. యూనివర్సిటీలో సమస్యలపై వీసీ రాజశేఖర్‌కు గతంలో తాము అనేకసార్లు వినతిపత్రాలు ఇచ్చామని, డిస్పెన్సరీలో వైద్యం అందడం లేదని, వసతులు లేవని చెప్పామని, ఆయన

... మిగతా 4వ పేజీలో

ఏసీబీకి చిక్కిన సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్

- సర్వే నంబర్ సరిచేసేందుకు రూ.30 వేలు డిమాండ్


ఏసీబీకి చిక్కిన సర్వేయర్ రంగోలి సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ నగేష్

మల్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

ములగాడ మండల తహశీల్దార్ కార్యాలయానికి చెందిన ఇద్దరు ఉద్యోగులు గురువారం ఏసీబీ వలకు చిక్కారు. వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన బోడేపల్లి రవితేజ తన ఇంటికి సంబంధించి సర్వే నంబర్ తప్పుగా ఉన్నదని, సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ములగాడ మండల తహశీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన సర్వేయర్ రంగోలి సత్యనారాయణ రిపోర్టు ఇచ్చేందుకు రూ.30 వేలు డిమాండ్ చేశాడు. అందుకు రవితేజ అంగీకారం తెలపడంతో, గురువారం సాయంత్రం కంచరపాలెం సమీపంలో గల పంజాబ్ హోటల్ వద్ద ఉన్న సచివాలయం వద్దకు డబ్బులు తీసుకురావాలని రవితేజకు తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నగేష్ చెప్పాడు. రవితేజ ఏసీబీ ట్రోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. అనంతరం డబ్బులు పట్టుకొని సచివాలయం వద్దకు బయలుదేరాడు. అక్కడ అతడి వద్ద నుంచి నగేష్ డబ్బులు తీసుకుంటుండగా అప్పటికే అక్కడకు చేరుకున్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సర్వేయర్ సత్యనారాయణ డబ్బులు తీసుకోమన్నాడని అతను చెప్పడంతో ఏసీబీ అధికారులు అక్కడి నుంచి నేరుగా ములగాడ

... మిగతా 4వ పేజీలో

7 నుంచి కొత్త జోన్లు

నియోజకవర్గాల పేర్లతో ఏర్పాటు

- కొత్తగా అగనంపూడి, మధురవాడ...
- భవనాల ఎంపిక, ఇతర ఏర్పాట్లపై అధికారులతో జీవీఎంసీ కమిషనర్ సమీక్ష



విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ పరిధిలో జోన్‌ల పునర్విభజనను వచ్చే నెల ఏడో తేదీ నుంచి అమల్లోకి తీసుకురావాలని అధికారులు నిర్ణయించినట్టు తెలిసింది. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న జీవీఎంసీలో ప్రస్తుతం ఎనిమిది జోన్‌లు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఒక నియోజక వర్గం పరిధిలో ఉన్న వార్డులు..మరొక నియోజకవర్గంలో ఉన్న జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. అదేవిధంగా ఒక జోన్ పరిధిలో రెండు, మూడు నియోజకవర్గాల పరిధిలో ఉన్న వార్డులు ఉండడంతో పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు జోన్‌ల పునర్విభజన చేపట్టాలని, ఒక జోన్ పరిధి ఒక నియోజకవర్గంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. భీమిలి, పెందుర్తి జోన్‌ల పరిధి చాలా ఎక్కువగా ఉండడంతో ప్రజలు, కార్పొరేటర్ల సౌలభ్యం కోసం ఆ రెండు నియోజకవర్గాలకు రెండేసి జోన్‌లు ఉండేలా మొత్తం జోన్‌ల సంఖ్య పదికి పెంచుతూ ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. దీనికి ప్రభుత్వం బుధవారం ఆమోదం తెలపడంతో దసరా తర్వాత మంచిరోజు చూసుకుని కొత్తజోన్‌లను అమల్లోకి తేవాలని అధికారులు నిర్ణయించారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ జీవీఎంసీలోని అన్ని విభాగాల అధిపతులతో గురువారం సమావేశం ఏర్పాటుచేసి కొత్తజోన్‌లను అమల్లోకి తేవడంపై చర్చించారు. కొత్తగా ఏర్పాటయ్యే రెండు జోన్‌లకు భవనాలను ఎంపిక చేయాలని, ఫర్నీచర్‌తోపాటు సిబ్బందిని కూడా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. వచ్చే నెల ఏడో తేదీ

... మిగతా 4వ పేజీలో


ధాన్యలక్ష్మి అలంకరణలో కనకమహాలక్ష్మి

ధాన్యలక్ష్మిగా కనకమ్మ

- అమ్మవారికి లడ్డూలతో సహస్ర నామార్చన

శరన్నవరాత్రుల్లో భాగంగా వన్‌టౌన్ బురుజుపేటలోని కనకమహాలక్ష్మి అమ్మవారు గురువారం ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి లడ్డూలతో సహస్ర నామార్చన చేశారు. కాగా శుక్రవారం కనకమహాలక్ష్మి ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిస్తారు.

-మహారాణిపేట/ఆంధ్రజ్యోతి

ఆధార్‌తో వాహనాలు అనుసంధానం

AADHAAR

ప్రభుత్వ నిర్ణయం

- జిల్లాలో 16 లక్షలకుపైగా వాహనాలు
- యజమానుల ఆధార్ నంబర్ లింకేజీ
- సచివాలయాల సిబ్బందికి బాధ్యతలు



విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

మోటారు సైకిల్ నుంచి భారీ వాహనం వరకూ అన్నింటినీ యజమానుల ఆధార్ నంబరుతో అనుసంధానం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన డేటాను జిల్లాకు పంపింది. సంక్షేమ పథకాల అమలుకు ఇది ఎంతో కీలకంగా మారనున్నది. విశాఖ జిల్లాలో సుమారు 16 లక్షల వాహనాలు ఉన్నాయి. వాటిని యజమానుల ఆధార్ నంబరుతో అనుసంధానం చేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. గతంలో ఒకసారి వాహనదారుల వివరాలు పంపి ఆధార్‌తో అనుసంధానం చేయాలని సూచించినప్పుడు సుమారు మూడు లక్షల మందే ముందుకువచ్చారు. ఈ పర్యాయం అలా కాకుండా ప్రతి వాహనాన్ని ఆధార్ నంబరుతో అనుసంధానం చేసే బాధ్యత గ్రామ/వార్డు సచివాలయానికి అప్పగించారు.

జిల్లాలో గల 607 సచివాలయాల సిబ్బంది తమ పరిధిలో వాహనదారులకు ఫోన్ చేసి ఆధార్ నంబరుతో వారి వాహనాలు అనుసంధానం చేసేలా చూడాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. సుమారు 16 లక్షల వాహనాలను ఆధార్ నంబరుతో అనుసంధానం చేసే ప్రక్రియ పూర్తిచేయడానికి కొంత సమయం పట్టే అవకాశం ఉందని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రతి వాహనదారుడి నుంచి అతని పేరు, వృత్తి, చిరునామా, వాహనం నంబరు, రకం తదితర అంశాలను నమోదుచేయనున్నారు. ఈ ప్రక్రియలో కొన్ని ఇబ్బందులున్నాయని సచివాలయ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. వ్యక్తిగత వాహనాల వరకు అది కూడా వాహనదారుడి వద్ద సంబంధిత వాహనం ఉంటే ఆధార్‌తో అనుసంధానం చేయడం కొంతవరకు సులువుగా ఉంటుందని చెబుతున్నారు. ఒకవేళ వాహనం విక్రయించిన తరువాత దాని రిజిస్ట్రేషన్ బదలాయింపు జరగకపోతే అనుసంధానం చేయడం ఇబ్బందిగా ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. కంపెనీ

... మిగతా 4వ పేజీలో

ఆర్టీసీ పండుగ స్పెషల్స్

- విజయనగరం జోనల్ పరిధిలో 50 బస్సులు నడిపినట్టు అధికారుల ప్రకటన
- నేడు కూడా...
- మహిళా ప్రయాణికులే అధికం

ద్వారకా బస్‌స్టేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

దసరా ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖరీజియన్ అధికారులు గురువారం విజయనగరం జోనల్ పరిధిలోని పలు ప్రాంతాలకు 50 ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. ఉదయం 6.00 గంటల నుంచి ద్వారకా బస్‌స్టేషన్, మద్దిలపాలెం, స్టీల్ సిటీ కాంప్లెక్సుల నుంచి ఈ ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేశారు. రాజమండ్రికి 5, కాకినాడ 4 స్పెషల్స్, శ్రీకాకుళానికి 8 ఇచ్ఛాపురానికి 4, పలాస 3, సోంపేట 3, పాతపట్నం 1, రాజాం 4, విజయనగరానికి 7, బొబ్బిలి 4, పార్వతీపురం 4, సాలూరు కు 3 బస్సులు ప్రత్యేక సర్వీసులుగా నడిపారు. అన్ని రూట్లలోను మహిళా ప్రయాణికులు అధికంగా ఉండడంతో స్త్రీశక్తి పథకం వర్తించే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను నడిపారు. శుక్రవారం దసరా ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందికనుక అందుకు తగ్గట్టుగా బస్సులు సిద్ధం చేశామని ఆర్‌ఎం బి.అప్పలనాయుడు తెలిపారు. జిల్లాలోని అన్ని డిపోల నుంచి ఎంపిక చేసిన 50 బస్సులు ప్రత్యేక సర్వీసులుగా నడిపేందుకు ఏర్పాట్లు చేశామని వెల్లడించారు.



స్వచ్ఛోత్సవ్‌లో కలెక్టర్

కలెక్టరేట్ ఆవరణను శుభ్రం చేస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన స్వచ్ఛోత్సవ్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పాల్గొని కలెక్టరేట్ ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించారు. అనంతరం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఆయనతో పాటు డీఆర్వో భవానీశంకర్, కలెక్టరేట్ ఏవో బీవీ రాణి, సిబ్బంది పాల్గొన్నారు. ఇతర కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది స్వచ్ఛోత్సవ్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. జిల్లా పరిషత్ ఆవరణలో సీఈవో పి.నారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు.

విలేజ్ మాల్స్

- రేషన్ డిపోలకు కొత్తరూపు
- ప్రయోగాత్మకంగా 15 డిపోల ఎంపిక
- బియ్యం, పంచదారతో పాటు మరిన్ని సరకులు, జీసీసీ ఉత్పత్తుల విక్రయానికి ఏర్పాట్లు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

రేషన్ డిపోల రూపురేఖలను మార్చేందుకు ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా విలేజ్ మాల్స్ పేరుతో బియ్యం, పంచదారతో పాటు మరిన్ని సరకులను వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు నిర్ణయించింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ ప్రయోగాత్మకంగా జిల్లాలో 15 రేషన్ డిపోలను గుర్తించి ఆ వివరాలను ప్రభుత్వానికి పంపింది. జిల్లాలో నాలుగు గ్రామీణ మండలాలు, నగరంలోని మూడు సర్కిళ్లలో కలిపి 5.24 లక్షల బియ్యం కార్డులు ఉన్నాయి. ప్రతి కార్డుకు సగటున ముగ్గురు సభ్యుల చొప్పున మొత్తం 15 లక్షల మంది ఉన్నారు. ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు కార్డుదారులకు బియ్యం, పంచదార అందిస్తున్నారు. అవేకాకుండా అన్నిరకాల నిత్యావసర సరకులు అందుబాటులో ఉండేలా పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటోంది. వాటితో పాటు గిరిజన కార్పొరేషన్ ఉత్పత్తులు ఉంచుతారు.

కొత్త టీచర్లలో సంబరం

- మెగా డీఎస్సీలో 1,269 మంది ఎంపిక
- విజయవాడలో 1,244 మందికి నియామకపత్రాల అందజేత
- హాజరుకాలేకపోయిన 25 మంది బాలింతలు, గర్భిణులు


కొత్త ఉపాధ్యాయురాలికి నియామకపత్రం అందజేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మొత్తం 1,269 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో 1,244 మంది గురువారం సాయంత్రం విజయవాడలో నియామకపత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు బుధవారం జిల్లా నుంచి సుమారు 80 బస్సుల్లో కొత్త ఉపాధ్యాయులు విజయవాడ బయలుదేరి వెళ్లారు. వీరిలో ఉమ్మడి జిల్లా అరకు ప్రాంతానికి చెందిన ఒకరిద్దరికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నియామకపత్రాలు అందజేశారు. మిగిలిన వారికి ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కౌంటర్లలో డీఈవో,ఇతర అధికారులు అందజేశారు.



పూర్ణాహుతి చేస్తున్న రుత్విక్‌లు

సంప్రదాయబద్ధంగా స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నారసింహుని ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని అప్పన్న సన్నిధిలో స్వాతి నక్షత్ర హవనం గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. యజ్ఞకర్తగా సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠంజేశారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సారధ్యంలో అర్చకులు భక్తుల గోత్రనామాలతో సంకల్పించి సుదర్శన, నారసింహులకు షోడశోపచారాలతో పూజలు జరిపారు. తరువాత కుంభారాధన, మండపారాధన, బింబారాధన చేసి ముందుగా సిద్ధం చేసిన హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు.నారసింహ, సుదర్శన మూల, మూర్తి మంత్రాలతో హవనాన్ని నిర్వహించారు. అనంతరం దేవాలయ ముఖ్య అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు పూర్ణ కలశాన్ని శిరస్సున పట్టుకుని బేడామండప ప్రదక్షిణ చేసి ప్రధానాలయంలో పూజలు చేశారు. కలశంలోని జలాలతో భక్తులను ప్రోక్షణ చేసిప్రసాదాలు అందజేశారు.

ఘనంగా సీపీఐ నేత ఏబీ బర్ధన్ జయంతి

తగరపువలస, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ నాయకుడు, రాష్ట్ర పూర్వపు కార్యదర్శి ఏబీ బర్ధన్ జయంతి స్థానిక సీపీఐ కార్యాలయంలో పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ కార్యదర్శి కొండపు ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత నాయకులు బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి కానూరి రాంబాబు మాట్లాడుతూ వామపక్ష ఉద్యమాల్లో బర్ధన్ సాధించిన విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోర అప్పలరాజు, చిల్ల రామ్‌పైడయ్య, అప్పలసూరి, నూలు ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో...

మధురవాడ : కార్మిక నేతగా అనేక ఉద్యమాలు చేసి పేదల అభ్యున్నతికి పాటుపడిన నాయకుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు అన్నారు. మధురవాడ సీపీఐ కార్యాలయంలో బర్ధన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బర్ధన్ కార్మిక ఉద్యమాల్లో పాల్గొని 20 సార్లు అరెస్టు కాగా ఐదేళ్ల జైల్లో ఉన్నారని చెప్పారు. అనంతరం పలువురు బర్ధన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాండ్రాసి సత్యనారాయణ, ఎండీ బేగం, వేలంగ జీరావు , తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఉచిత శిక్షణ ప్రారంభం

భీమునిపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధశ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికలకు కంప్యూటర్ ఉచిత శిక్షణ తరగతులను ఆ సంస్థ ఛైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి గురువారం ప్రారంభించారు. కలిగొట్ల వీధిలోని సంస్థ కార్యాలయంలో 30 మంది బాలికలకు ఈ శిక్షణ ఇస్తున్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



పద్మనాభం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అమ్మవారి మండపం వద్ద గురువారం రాత్రి దీపారాధన చేశారు. మహిళలు ఓంకారం ఆకారంలో తైల దీపాలను అలంకరించారు. అనంతరం భవానీలు నామ సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మా పొట్ట కొట్టొద్దు..

- బడ్డీల తొలగింపుతో రోడ్డున పడ్డాం
- ప్రభుత్వమే ఆదుకోవాలి
- జోనల్ కార్యాలయం ఎదుట చిరువ్యాపారుల ధర్నా
- హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తాం : జడ్సీ



జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న చిరువ్యాపారులు

భీమునిపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బడ్డీలు, దుకాణాల తొలగింపుతో రోడ్డున పడ్డ తమను ప్రభుత్వమే ఆదుకోవాలని చిరువ్యాపారులు కోరారు. గురువారం వారు సీఐటీయూ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జోనల్ కమిటీ కార్యదర్శి ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ తగరపువలసలో ప్రధాన రహదారులను ఆనుకుని ఎంతోమంది బడాబాబులు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా.. కన్నెత్తి చూడని అధికారులు రోడ్ మార్జిన్‌లో చిరువ్యాపారాలు చేసుకునే పేదల బడ్డీలను తొలగించడం అన్యాయమన్నారు. ఎటువంటి నోటీసులు లేకుండా ఆకస్మాత్తుగా బడ్డీలను బలవంతంగా తరలించడం వల్ల ఎన్నో దుకాణాలు దెబ్బతిన్నాయని, వాటికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారులకు ఉపాధి చూపే వరకూ పోరాడుతామని చెప్పారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ అధికారులు కార్పొరేటర్లందరినీ విజ్ఞాన యాత్రకు పంపించి ఆపరేషన్ లంగ్స్ చేపట్టడం బాధాకరమన్నారు. అనంతరం జడ్సీ అయ్యప్పనాయుడుకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో యూసీడీ ఏపీడీతో స్ట్రీట్ వెండర్స్ జాబితా రూపొందిస్తామన్నారు. తర్వాత వెండర్స్ జోన్ నిర్ణయించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నీలాతి రాము, డి. బాబాజీ, దువ్వి నరసింగరావు, పిల్లా నరసింగరావు పాల్గొన్నారు. కాగా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్ఐ హరీష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రోడ్ల విస్తరణ వరకూ ఆగండి

భీమిలి మెయిన్ రోడ్‌లో ఏళ్ల తరబడి బడ్డీలు పెట్టుకుని జీవనోపాధి పొందుతున్న వారిని ఇబ్బందులు పెట్టవద్దని స్థానిక నాయకులు జడ్సీ అయ్యప్పనాయుడును కోరారు. గురువారం వారు జడ్సీతో మాట్లాడారు. మెయిన్ రోడ్‌లో ఎంపీడీవో కార్యాలయం ప్రహరీని ఆనుకుని, మెయిన్ రోడ్ మార్జిన్‌లో బడ్డీలు పెట్టుకుని చిరువ్యాపారులు బతుకుతున్నారన్నారు. వారిని వెంటనే దుకాణాలు ఖాళీ చేయాలని ఆదేశిస్తే ఎక్కడికి వెళ్లిపోతారని ప్రశ్నించారు. మెయిన్ రోడ్ విస్తరణ ప్రతిపాదనలు ఉన్నందున అప్పటివరకూ వారికి అవకాశం ఇవ్వాలని కోరారు.ఈ విషయాన్ని ఎమ్మెల్యే గంటా దృష్టికి కూడా తీసుకువెళ్లి న్యాయం చేయమని కోరుతామని చెప్పారు. అనంతరం, జడ్సీకి వినతి అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, నాయకులు మారోజు సంజీవకుమార్, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ పైలపల్లి లక్ష్మణరావు, పూసర్ల సురేంద్ర, సుబ్రహ్మణ్యం, కోండ్రు చిన్నికృష్ణ, దువ్వి రమేశ్ పాల్గొన్నారు.



స్వతంత్రనగర్ కాలనీలో శిథిలాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

శిథిలాలు తొలగింపు

మధురవాడ : ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా జీవీఎంసీ అధికారులు మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీలో బడ్డీలు, ఫుట్‌పాత్‌లు తొలగించిన విషయం తెలిసిందే. పలుచోట్ల భవనాల శిథిలాలు పేరుకుపోయాయి. వీటివల్ల స్థానికులు ఇబ్బందులు పడుతుండడంతో జీవీఎంసీ సిబ్బంది యంత్రాలతో తొలగిస్తున్నారు. మిథిలాపురి వుడాకాలనీ, స్వతంత్రనగర్ కాలనీ, కొమ్మాది కూడలిలో భారీగా బడ్డీలు తొలగించారు. కొందరు దుకాణాల ముందు దారి కోసం కాంక్రీట్ శ్లాబులు వేశారు. వాటిని కూడా అధికారులు తొలగిస్తున్నారు. కాగా బడ్డీలు, దుకాణాల తొలగింపుతో చిరువ్యాపారులు, స్ట్రీట్ వెండర్లు ఉపాధి కోల్పోయిన విషయం తెలిసిందే. జోన్లు వారీగా అధికారులు బాధితుల వివరాలు సేకరిస్తున్నారు. అనంతరం జాబితా తయారు చేసి, వారికి ప్రాంతాల వారీగా ప్రభుత్వ స్థలాల్లో హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేస్తారని తెలిసింది. అలాగే గుర్తింపు కార్డులు కూడా జారీ చేసి హాకర్స్ జోన్‌లో స్థలం లేదా తోపుడు బండి ఏర్పాటు చేసుకోడానికి అనుమతి ఇస్తారు.

వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం

ఔషధ దినోత్సవంలో వక్తలు

ఎండాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని, ముఖ్యంగా వైద్య రంగాన్ని గ్రామాల్లో కూడా బలోపేతం చేయాలంటే కమ్యూనిటీ ఫార్మసీకి ప్రాధాన్యత పెరగాలని గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి. గీతాంజలి అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం పురస్కరించుకుని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఫార్మసీ నిపుణులు, వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ఫార్మాసిస్టులు ప్రజలకు విలువైన సేవలు అందించాలని సూచించారు. డాక్టర్ రెడ్డీస్ సంస్థ సైరైల్ ఆపరేషన్స్ విభాగాధిపతి నీలేష్ ఆర్. పటేల్ మాట్లాడుతూ కృత్రిమ మేథ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఔషధ పరిశోధనలు, ఔషధాల తయారీ, క్లీనికల్ నిర్ధయాలు తక్కువ సమయంలోనే పూర్తవుతున్నాయని తెలిపారు. ఔషధ రంగంలో కృత్రిమ మేథ ఆధారంగా ప్రజలకు సేవలందించవచ్చునని వివరించారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎల్. శ్రీనివాస్ మాట్లాడుతూ మానవాళి ప్రాణాలను రక్షించే ఔషధాల అభివృద్ధిలో, తయారీలో ఫార్మాసిస్టుల పాత్ర ముఖ్యమైనదన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే గీతం ఆసుపత్రి ఫార్మసీ మేనేజర్ ఆంజనేయ భూపతిని,డాక్టర్ సాగర్ సుమన్ పండాను సన్మానించారు.



ఔషధ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి

అవంతి కళాశాలలో..

భీమునిపట్నం (రూరల్) : తగరపువలస అవంతి ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఔషధ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫార్మసీ అధ్యాపకులు ముత్తంశెట్టిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.లలిత, అపోలో ఆసుపత్రి కార్డియాలజిస్టు డా. అనూరాధ, చెన్నై మెడిసిటీ డాక్టర్ డా. హరిహరన్, అవంతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాగశ్రీ పాల్గొన్నారు. అంతకముందు బంగ్లామెట్ట ఆర్‌టీసీ బస్సు షెల్టర్ నుంచి తగరపువలస మెయిన్ రోడ్డు మీదుగా వైఎస్ఆర్ విగ్రహం వరకు ఫార్మాసిస్టులు ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు.



లడ్డూ విక్రయాలు నిలిపివేత

సాగర్‌నగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో ఉన్న శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూ విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఏఈఓ జగన్మోహనాచార్యులు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టీటీడీ దేవస్థానంలో బ్రహ్మోత్సవాల కారణంగా రుషికొండ ఆలయానికి లడ్డూ సరఫరా జరగడం లేదన్నారు. ఈమేరకు విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసినట్టు చెప్పారు.

చిన్నాపురంలో పౌష్టికాహార ప్రదర్శన

పద్మనాభం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిన్నాపురంలో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు నిత్యం తీసుకోవాల్సిన పోషకాహారం గురించి ఈ శిబిరంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జియా ఉన్నీసా, సర్పంచ్ ఈగల అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పండిట్ దీనదయాళ్ జయంతి

పద్మనాభం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) :పద్మనాభంలోని బీజేపీ కార్యాలయంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి రవికుమార్, కృష్ణారావు, వెంకటరావు పాల్గొన్నారు.

ఆపరేషన్ లంగ్స్‌కు తాత్కాలిక విరామం

చీఫ్ సిటీప్లానర్ ప్రభాకరరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాల తొలగింపునకు జీవీఎంసీ ప్రారంభించిన 'ఆపరేషన్ లంగ్స్'కు శుక్రవారం నుంచి తాత్కాలికంగా విరామం ఇచ్చినట్టు చీఫ్ సిటీప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. దసరా నేపథ్యంలో వ్యాపారుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దసరా తర్వాత తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ సమయాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకుని, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను స్వయంగా తొలగించుకోవాలని కోరారు. దుకాణాలను కోల్పోయిన వ్యాపారులకు నగరంలో ఏర్పాటు చేసే స్ట్రీట్ వెండింగ్ జోన్స్‌లో దుకాణాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

7 నుంచి కొత్త జోన్లు

... 3వ పేజీ తరువాయి

మంచి రోజు కావడంతో ఆరోజు నుంచి కొత్తజోన్‌ల పాలన ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సూచించినట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే జోన్‌లను కూడా నంబర్లతో కాకుండా నియోజకవర్గాల పేర్లతోనే పిలిచేలా పునర్వ్యవస్థీకరించారు. కొత్తగా భీమిలి జోన్‌లో గతంలో మాదిరిగా నాలుగు వార్డులు ఉంటే, భీమిలి నియోజకవర్గంలో ఏర్పాటయ్యే రెండోజోన్‌కు మధురవాడ జోన్‌గా, జోన్-3 కార్యాలయాన్ని ఇకపై తూర్పు జోన్ కార్యాలయంగా, జోన్-4 కార్యాలయాన్ని సౌత్‌జోన్‌గా, జోన్-5 కార్యాలయాన్ని పశ్చిమ జోన్‌గా, జోన్-6ని గాజువాక జోన్‌గా, జోన్-7ని అనకాపల్లి జోన్‌గా మార్చారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని జోన్-8ని పెందుర్తి జోన్‌గా మార్చి, అదే నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌కు అగనంపూడి జోన్‌గా పేరుమార్చారు. ప్రస్తుతం ఉన్న అన్ని జోన్‌ల కార్యాలయాలకు భవనాలు ఉండగా నార్త్‌జోన్‌తో పాటు అగనంపూడి జోన్‌లకు మాత్రం కార్యాలయాల కోసం కొత్త భవనాలను గుర్తించాల్సి ఉండడంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటయ్యే పది జోన్‌లలో గాజువాక జోన్ 108.11 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో అతిపెద్దజోన్‌గా మారగా, 102.830 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో అగనంపూడి జోన్ రెండో అతిపెద్దగా జోన్‌గా, 9.698 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో సౌత్‌జోన్ అత్యంత చిన్నజోన్‌గా మారింది.

ఆధార్‌తో వాహనాల అనుసంధానం

... 3వ పేజీ తరువాయి

వాహనాలు, ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన వాహనాలు, పెద్దపెద్ద ట్రాన్స్‌పోర్టు కంపెనీల వాహనాలకు ఆధార్ నంబరుతో అనుసంధానం చేయడం అంత సులువు కాదని సచివాలయ ఉద్యోగి ఒకరు అభిప్రాయపడ్డారు. మిగతా వాహనాలకు సంబంధించి ఆయా కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలకు ప్రత్యేకించి లేఖలు రాసి వివరాలు తీసుకోవాల్సి ఉంటుంది. తూర్పు నావికాదళానికి చెందిన వాహనాలు అనుసంధానం చేయడానికి జిల్లా యంత్రాంగం ద్వారా ప్రయత్నించాల్సి ఉందని పేర్కొంటున్నారు.

ఏఈఓ ఆనంద్‌కుమార్‌పై విచారణకు లోకాయుక్త సిఫారసు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం దేవస్థానంలో మొన్నటివరకు పనిచేసి ఇప్పుడు కనకమహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ అయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ) ఆనంద్‌కుమార్ అదనపు ఆదాయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలంటూ దేవదాయ శాఖ కమిషనర్‌కు లోకాయుక్త సిఫారసు చేసింది. గాజువాకకు చెందిన దొడ్డి రమణ అనే వ్యక్తి ఆనంద్‌కుమార్ అక్రమ వ్యవహారాలపై లోకాయుక్తకు నెల క్రితం ఫిర్యాదు చేశారు. ఆనంద్‌కుమార్ దీర్ఘకాలంగా సింహాచలం దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తున్నారని, బదిలీలు ఆపుకుంటున్నారని, భక్తులు ఇచ్చే విరాళాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తాళ్లపాలెం సమీపానున్న చిన్నమల్లం గ్రామంలో 'విశ్వజ్ఞానుల విజ్ఞాన విహార క్షేత్రం' పేరుతో ఆశ్రమాన్ని బినామీల పేరుతో నడుపుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సింహాచలంలో భక్తులను ఏమార్చి, వారిచ్చే విరాళాలను ఆశ్రమానికి తరలించారని పేర్కొన్నారు. ఈఈ శ్రీనివాసరాజుతో కలిసి అవినీతి పనులు చేస్తున్నారని, చందనోత్సవ సమయాల్లో అదనపు టికెట్లు ముద్రించి అధిక రేట్లకు అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన లోకాయుక్త చందనోత్సవంపై ప్రభుత్వం విచారణ చేస్తున్నందున దానిపై మళ్లీ విచారణ అవసరం లేదని పేర్కొంది. అయితే అక్రమ సంపాదన తేల్చడానికి, ఆదాయానికి మించిన ఆస్తులు ఉంటే చర్యలు తీసుకోవాలని సూచిస్తూ దేవదాయ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేసింది. ఆదేశాలు వచ్చి నెల రోజులు కావస్తున్నా.. ఇంకా విచారణ ప్రారంభం కాకపోవడం గమనార్హం.

సింహాచలం దేవస్థానం అధికా రులపై ఎటువంటి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా కమిషనర్ కార్యాలయం వద్దనే నీరుగారిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో తప్పక విచారణ చేయిస్తున్నా ఎవరిపైనా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వేధింపుల్లో వైసీపీకి మించిన వారు లేరు

అసెంబ్లీలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇతర పార్టీలకు చెందిన వారిని వేధించడంలో వైసీపీకి మించిన పార్టీ లేదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన అసెంబ్లీలో రాజకీయ వేధింపులపై మాట్లాడారు. తన మిత్రుడు, టీడీపీ సానుభూతిపరుడైన నలంద కిశోర్‌ను వైసీపీ పెద్దలు తీవ్రంగా వేధించి, చనిపోయేలా చేశారన్నారు. కరోనాలో అమెరికా నుంచి ఓ మిత్రుడు పంపిన వాట్సాప్ మెసేజ్‌ను ఆయన తన స్నేహితులకు షేర్ చేయగా, అందులో విషయం అప్పటి ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్‌ఛార్జికి ఇబ్బంది కలిగించిందని ఆరోపిస్తూ సీఐడీ పోలీసులు కిశోర్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. కరోనా తీవ్రస్థాయిలో ఉన్న సమయాన విచారణ పేరుతో చిన్న కారులో ఇరికించి కర్నూలు తీసుకెళ్లి మూడు రోజులు వేధించారని తెలిపారు. కరోనా సోకిన ఆయన కోలుకోకుండానే మరణించారన్నారు. వాట్సాప్ మెసేజ్‌కే మరణ శిక్ష విధించిన వైసీపీ కంటే వేధింపులు ఎక్కడా ఉండవన్నారు.

బీచ్‌లో పరిసరాల పరిశుభ్రత



కార్యక్రమంలో పాల్గొన్న జడ్సీ అయ్యప్పనాయుడు, జీవీఎంసీ సిబ్బంది

భీమునిపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్‌లో జీవీఎంసీ సిబ్బంది గురువారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.కమిషనర్ ఆదేశాల మేరకు జడ్సీ అయ్యప్పనాయుడు, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సభ్యులు, టీడీపీ నాయకులు, ప్రజారోగ్య సిబ్బంది బీచ్‌లో చెత్త ఏరివేసి డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచాలని సందర్శకులను చైతన్యపరచాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లికార్జునరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం శ్రమదానం, మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, జెడ్పీ వైస్ ఛైర్మన్ ఎస్. గిరిబాబు, ఎంపీడీఓ జయ ఉమ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, హౌసింగ్ ఏఈ పద్మ, స్థానిక నాయకులు ఎర్నాయుడు, పద్దు, బుగత రాము, పాల్గొన్నారు.

ఫ్లూయెంట్ గ్రిడ్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్‌లతో ఈపీడీసీఎల్ ఎంఓయూలు



ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థతో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్. పక్కన ఇతర అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో ఎనర్జీ ట్రాన్సిషన్‌ను వేగవంతం చేసేందుకు ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) గురువారం రెండు కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకుంది. కొత్తగా ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌తో వ్యవహారాలు నడిపేందుకు ఫ్లూయెంట్ గ్రిడ్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ (సీసీఎఫ్) సంస్థలు ముందుకువచ్చాయి. విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ ఆధునికీకరణ, డీకార్బనైజేషన్, కొత్త స్టార్టప్‌ల గుర్తింపు, ప్రోత్సాహం వంటివి సీసీఎఫ్ చేపడుతుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్మార్ట్ గ్రిడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఫ్లూయెంట్ గ్రిడ్ పైలట్ ప్రాజెక్టుగా చేపడుతుంది. ఎంఓయూలు చేసిన సందర్భంగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, పునరుత్పాదక రంగంలో ఈ ఒప్పందాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లూయెంట్ గ్రిడ్, సీసీఎఫ్ ప్రతినిధులతో పాటు ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, సీజీఎం డి.సుమన్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు మణికంఠ మరణించాడని ఆరోపించారు. అంతా వర్సిటీ ప్రధాన గేటు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ఆందోళనకు దిగారు. సుమారు 18 సార్లు ఈ సమస్య వీసీ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన పట్టించుకోలేదని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. మరణించిన మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలని, కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని కోరారు. వీసీ రాజశేఖర్ అక్కడికి వచ్చి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే విద్యార్థి నాయకులు దీనికి సంతృప్తి చెందలేదు. డిస్పెన్సరీలో వైద్యం అందకపోవడానికి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని, తక్షణమే వైద్యసదుపాయాలు కల్పించాలని, వీసీ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఇలా ఈ ఆందోళన తీవ్ర రూపం దాల్చి...సుమారు 50 మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని ప్రొఫెసర్లు, పోలీసులు అడ్డుకొని వీసీకి రక్షణ కల్పించారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోని మీకు వీసీగా ఉండే అర్హత లేదని, రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులు మరింత మంది వచ్చి వారిని బయటకు తీసుకువచ్చారు.

కేజీహెచ్‌కు వెళ్లి వైద్యులతో వీసీ చర్చలు

మణికంఠ మృతదేహానికి పోస్ట్‌మార్టం చేయకుండా తమకు ఇవ్వాలని తండ్రి శ్రీనివాసరావు కేజీహెచ్ వైద్యులను కోరారు. వీసీ వచ్చి చెబితే తప్ప తాము ఏమీ చేయలేమని వైద్యులు చెప్పడంతో వారు యూనివర్సిటీకి వచ్చి వీసీని కలిశారు. కేజీహెచ్‌కు రావాలని కోరారు. పోలీసుల సాయంతో వీసీ కేజీహెచ్‌కు వెళ్లి చర్చలు జరిపారు. మణికంఠ మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, దానికి ఎవరూ బాధ్యులు కారని రాతపూర్వకంగా ఇస్తే పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని ఇస్తామని వైద్యులు చెప్పడంతో తండ్రి శ్రీనివాసరావు అక్కడికక్కడే ఆ విధంగా లేఖ రాసి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి ఇచ్చారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కూడా ఓ లేఖ ఇవ్వడంతో వైద్యులు మృతదేహాన్ని ఇవ్వడానికి రాత్రి ఏడు గంటలకు అంగీకరించారు.

కొవ్వొత్తులతో నివాళి

వీసీ రాజశేఖర్ కేజీహెచ్‌కు వెళ్లిన తరువాత కూడా విద్యార్థులు ఏయూలో ఆందోళన కొనసాగించారు. రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు వారితో చర్చించారు. డిస్పెన్సరీలో తక్షణమే వసతులు కల్పిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే వీసీ రాజీనామా చేయాల్సిందేనని విద్యార్థులు పట్టుబట్టారు. దీనిపై ఆరోగ్య శాఖ మంత్రికి, డిప్యూటీ సీఎంకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శుక్రవారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు. రాత్రి 7.30 గంటకు ఆందోళన విరమించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్

... 3వ పేజీ తరువాయి

మండల తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వేయర్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా సిబ్బంది నుంచి కూడా ఫోన్‌లు తీసుకొని.. కొంతసేపు తరువాత తిరిగి ఇచ్చేశారు. సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను అవినీతి నిరోధశాఖ సెక్షన్ ప్రకారం 2018 సెక్షన్ 7 కింద అరెస్టు చేశారు. శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

ఘనంగా అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల తిరువీధి ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఊరేగించారు.

ఉత్సాహంగా ఏయూ యోగా జట్టు ఎంపిక పోటీలు


ఏయూ యోగా జట్టు ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏయూ గోల్డెన్ జూబ్లీ ఇండోర్ జిమ్నాజియం హాల్లో గురువారం ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా జట్టు ఎంపిక పోటీలు జరిగాయి. ఉప కులపతి ఆచార్య జీపీ రాజశేఖర్ ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం యోగాను క్రీడాంశంగా ప్రాచుర్యం కల్పించడం విశేషమన్నారు. అంతర్ వర్సిటీ యోగా పోటీల్లో ఏయూ పతకం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, యోగా కమిటీ సభ్యులు డాక్టర్ ఉమాదేవి, ప్రొఫెసర్ కేఏఎన్ మూర్తి, ఉదయ్, డాక్టర్ దిలీప్ పాల్గొన్నారు.

ముగిసిన టీఎన్ఏఐ రాష్ట్ర సదస్సు


విద్యార్థినికి అవార్డు అందిస్తున్న అధ్యాపకులు

వెంకోజీపాలెం,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏయూ కన్వెక్షన్ సెంటర్ వేదికగా 31వ టీఎన్ఏఐ వార్షిక రాష్ట్ర స్థాయి సదస్సు 2025 గురువారం ఘనంగా ముగిసింది. ట్రైన్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఈ కార్యక్రమాన్ని లెర్నింగ్ టుడే లీడింగ్ టుమారో ద జర్నీ ఆఫ్ ఎ నర్సింగ్ స్టూడెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించింది. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన దాదాపు మూడు వేల మంది విద్యార్థులు సదస్సులో భాగస్వాములయ్యారు. టీఎన్ఏఐ ఏపీ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్.షంషీర్‌బేగం సదస్సు విజయవంతంపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల భాగస్వామ్యం, సమన్వయంతో విజయవంతం చేయడం అభినందనీయమన్నారు. కార్యదర్శి ఏపీఎన్ఎంసీ రిజిస్ట్రార్ ఆచార్య కె.సుశీల మాట్లాడుతూ నిత్యం పుస్తకాలతో మమేకమై ఉండే విద్యార్థులు క్రీడలు, సాంస్కృతిక మేధో పోటీల్లో ప్రతిభ చాటారన్నారు. పోటీలలో పాల్గొనడం, ప్రతిభ చూపడం ముదావహమన్నారు. సలహాదారు డాక్టర్ ఎం.సత్యవల్లి అసోసియేషన్ తరఫున భాగస్వాములైన కళాశాలల యాజమాన్యాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

పరిశుభ్రత అందరి బాధ్యత

» పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే


పరిసరాలను శుభ్రం చేస్తున్న పోర్టు అధికారులు

సిరిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ దుర్గేష్ కుమార్ దూబే అన్నారు. గురువారం 'ఏక్ దిన్-ఏక్ గంటా-ఏక్ సాథ్' కార్యక్రమంలో భాగంగా సాలిగ్రామపురం వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో విశాఖపట్నం పోర్ట్ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో 'స్వచ్ఛోత్సవ్' అనే థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఇలాంటి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసి, అన్ని విభాగాల్లో విశాఖ పోర్టును దేశంలో నంబర్‌వన్‌గా నిలిపేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, ఆయా విభాగాధిపతులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **ఓజీ** : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కిష్కింధపురి** : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),
- **ఘాటీ** : గోకుల్, ముక్తాస్, (గాజువాక)
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	115
లైవ్ ధర	130
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

ట్రాఫిక్ నిర్వహణకు ఏఐ సాంకేతికత

» ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్



కలెక్టర్, సీపీతో కలిసి అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ సులభమైన పద్ధతిలో సాగాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల రాకపోకలు, ప్రయాణాలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ఏఐ సాయంతో నాణ్యమైన పరిష్కారం కనుగొనాలని సూచించారు. స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్ లింకు వ్యవస్థను అనుసరిస్తే చాలా వరకు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, నిర్వహణ సులభతరమవుతుందని అభిప్రాయపడ్డారు. వాహనదారుల ట్రాఫిక్ ఉల్లంఘన, అపరాధ రుసుం విధింపు, వసూళ్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి బృహస్పతి, అవిరోస్, ఆర్కడిస్, నయన్ సంస్థలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చాయి. హైదరాబాద్, బెంగళూరు, ఇండోర్, లక్నో, ఢిల్లీ తదితర నగరాల్లో అవలంబిస్తున్న విధానాలు, సాంకేతిక సహాయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నిబంధనల ఉల్లంఘనలపై కేసుల నమోదు తదితర అంశాలపై ఇటీవల చేపట్టిన పైలట్ ప్రాజెక్టు నమూనాలను వివరించారు. ఎయిర్‌పోర్టు, ఆర్కేబీచ్, బిర్లాజంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్‌అండ్‌బీ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీపై సేకరించిన నమూనాలను ప్రదర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సాంకేతిక సహాయాన్ని సమృద్ధిగా వినియోగిస్తే ప్రమాదాలు తగ్గడంతోపాటు ప్రజల్లో పరివర్తన కలుగుతుందని తద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రజలు సులభంగా ప్రయాణాలు సాగించేలా ఆధునిక పద్ధతులు ఉండాలని పేర్కొంటూ ఆ దిశగా అధికారులు సాంకేతిక నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చేనెల తొలివారంలో జీవీఎంసీ నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ సిద్ధం చేయాలని సూచించారు. దీనిపై సూచనలు, సలహాలు స్వీకరించి అక్టోబరు నెలాఖరుకల్లా టెండర్లు ఆహ్వానించాలన్నారు.

ఉత్తమ పరిశోధనల జాబితాలో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులు


ఆస్పత్రి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు

ఆరిలోవ,సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల స్టాన్‌ఫర్డ్, ఎల్సెవియర్ యూనివర్సిటీలు సంయుక్తంగా ప్రకటించిన జాబితాలో ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వైద్యులు ఉత్తమ పరిశోధనలో స్థానం దక్కించుకున్నారని యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ పరిశోధనా తీరును కనబరిచిన శాస్త్రవేత్తలను గుర్తించి జాబితాను ప్రకటిస్తారు. ఈ క్రమంలో 2025కి గాను 61 మంది భారతీయ శాస్త్రవేత్తలు వార్షిక ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించగా అందులో 15 మంది ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య సంస్థ వైద్యులున్నారు. అంతేకాకుండా టాప్ 2 శాతం సైంటిస్ట్ లిస్ట్ ప్రామాణిక సూచనా (సైటేషన్) మెట్రిక్ ఆధారంగా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుల్లపల్లి ఎన్ రావు జీవితకాల ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో నిలిచారు. 2024 వార్షిక పనితీరుకు గాను ఆయనకు ఈ గుర్తింపు లభించింది.

'ఆటో డ్రైవర్ల సేవలో'కు గడువు పెంచాలి

» ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం ఎంఎంటీసీ వుడా అపార్ట్‌మెంట్ వద్ద శ్రీషిర్డీ సాయి ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ మాట్లాడుతూ 'ఆటో డ్రైవర్ల సేవలో' దరఖాస్తు సమర్పణకు గడువు పెంచి రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు సచివాలయంలో 'ఆటో డ్రైవర్ల సేవలో'కు దరఖాస్తుకు మూడు రోజుల సమయాన్ని ఇచ్చారని, సచివాలయం సిబ్బంది అందుబాటులో లేకపోవడం, సర్వర్లు పని చేయకపోవడం జరిగిందన్నారు. దీంతో కొత్త, పాత సభ్యులు నమోదును పూర్తి చేసుకోలేకపోయారని, రాష్ట్రంలో ఐదు లక్షలకు పైగా ఆటోలు ఉంటే, మూడు లక్షల పది వేలు ఆటోలకు మాత్రమే వాహన మిత్ర వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటనలు చేయడమేమిటని ప్రశ్నించారు. మిగతా డ్రైవరు సోదరులందరికీ 'ఆటో డ్రైవర్ల సేవలో'కు దరఖాస్తు గడువును పెంచి డ్రైవర్లను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాండ్‌డ్రైవర్లు అవనాపు శ్రీను, లంక గోవింద్, అప్పలనాయుడు, సూరిబాబు, రాజు, సోములు, పైడిరాజు,కన్నారావు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ఆరిలోవ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో నిర్వహిస్తున్న దేవీనవరాత్రుల్లో విజయ దుర్గాదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఏయూ వీసీ రాజీనామాకు విద్యార్థుల డిమాండ్

» బీఈడీ విద్యార్థి మణికంఠ మృతికి బాధ్యత వహించాలంటూ నినాదాలు


ఏయూ వీసీ కార్యాలయం గేటు వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : బీఈడీ విద్యార్థి మణికంఠ మృతికి నిరసనగా గురువారం సాయంత్రం ఏయూ వీసీ కార్యాలయం వద్ద విద్యార్థులు ఆందోళనకు దిగారు. మృతుడు ఫోటోలు ప్రదర్శిస్తూ వీసీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి మణికంఠకు నివాళులు అర్పించారు. వీసీ కార్యాలయం బయట ఆందోళన చేయడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. ఆందోళనలు చేపట్టకూడదని పంపిచే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. మణికంఠకు న్యాయం జరగాలని ఉద్యమిస్తే పోలీసులతో బెదిరింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీఈడీ విద్యార్థి మృతికి ఏయూ ఉపకులపతి బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమండ్ చేశారు. డిస్పెన్సరీలో మౌలిక వసతులు కల్పించి, ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.బీఈడీ విద్యార్థుల ఆందోళనకు ఇతర కోర్సుల విద్యార్థులు మద్దతు తెలిపారు. విద్యార్థి సంఘాలు కూడా వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు ఏయూ గేట్లు మూసివేశారు.

మారిన ధరలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలి : జేసీ



మహారాణిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల ప్రభావంతో మారిన ధరలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుబజార్లు, రేషన్ దుకాణాలు, ఆర్టీసీ, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల పరిధిలో ఉన్న చర్యలపై సమీక్షించారు. జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా క్షేత్రస్థాయి చర్యలు ఉండాలన్నారు. అధికారులు, వినియోగదారులు, సంక్షేమ సంఘాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆహార భద్రత, తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా గురువారం సాయంత్రం మరోసారి నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ అర్బన్, రూరల్ ఏరియాలో ఎల్‌పీజీ గ్యాస్ సమస్యలు, రైతుబజార్లు, ఫుడ్‌సేఫ్టీ ఇతర శాఖలలో సమస్యలపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలు, రాష్ట్ర పన్నులు, ఈపీడీసీఎల్, తూనికలు, కొలతలు, గ్రామీణ నీటి సరఫరా, ఆర్టీసీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇగ్నో సిబ్బంది స్వచ్ఛోత్సవ్


తీరంలో చెత్త తొలగిస్తున్న ఇగ్నో సిబ్బంది

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఒక రోజు ఒక గంట అందరూ కలసి పరిశుభ్రం కోసం పని చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సిబ్బంది గురువారం శ్రమదానం నిర్వహించి సముద్ర తీరంలో చెత్తను తొలగించారు. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఆధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ, విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని ఇగ్నో అధ్యయన కేంద్రాల విద్యార్థులతో కలసి శ్రమదానం నిర్వహించారు. సాగరతీరంలో చెత్తను సేకరించి, మూటలుగా కట్టి డంపింగ్ యార్డుకు తరలించారు. అనంతరం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఇగ్నో అదనపు సంచాలకుడు డాక్టర్ ఐకృష్ణారావు, సమన్వయకర్తలు డాక్టర్ డి.నాగరాజుకుమారి, డాక్టర్ కె.శిరీష తదితరులు పాల్గొన్నారు.

11, 12 వార్డుల్లో..

ఆరిలోవ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులోని 18 నెంబరు సచివాలయం పరిధిలో గల జీవీఎంసీ ఆస్పత్రి వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తలు, పారిశుధ్య సిబ్బంది గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ బంగార్రాజు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉండవన్నారు. కార్యక్రమంలో టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, సీనియర్ నాయకులు సబ్బవరపు అప్పలనాయుడు, పచ్చిపాల శ్రీను, పారిశుధ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే 12వ వార్డులో గల శ్రీకాంత్‌నగర్‌లో రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలో 12వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌రామారావు, టీడీపీ 12వ వార్డు ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, 12వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గాడి సత్యం, పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలారావు తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో..

వెంకోజీపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డులో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా కేఆర్ఎం కాలనీలోని పార్కులో గురువారం వార్డు టీడీపీ వార్డు ఇన్‌చార్జి ముగడ వాసు, ఐటీడీపీ ఇన్‌చార్జి పల్లా బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శానిటరీ వర్కర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత జీవితంలో భాగం కావాలి

» ఐఐటీ అగర్తలా పూర్వ సంచాలకుడు అవధాని


సమావేశంలో మాట్లాడుతున్న ఆచార్య పీఎస్ అవధాని

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత మన జీవితంలో అంతర్భాగం కావాలని ఐఐటీ అగర్తలా పూర్వ సంచాలకుడు ఆచార్య పీఎస్ అవధాని అన్నారు. పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకొని ఆంధ్రా యూనివర్సిటీ విద్యావిభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'స్వచ్ఛత కోసం ఒక గంట శ్రమదానం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి స్నాతకోత్సవ మందిరం ప్రాంగణంలోని పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవధాని మాట్లాడుతూ పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ బహుముఖప్రజ్ఞాశాలిగా నిలుస్తారన్నారు. నిరాడంబర జీవితం, ఉన్నత ఆలోచనా విధానం ఆయన నుంచి యువత నేర్చుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన భారత ప్రభుత్వ కార్పొరేట్ అండ్ పబ్లిక్ పాలసీ మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ యాదగిరి మాట్లాడుతూ యువత స్వచ్ఛత దిశగా అడుగులు వేయడం, సమాజాన్ని ప్రగతి దిశగా నడిపించడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యావిభాగాధిపతి టి.షారోన్‌రాజు, ఆచార్యులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము తదితరులు పాల్గొన్నారు.

మూడో అంతస్థు పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్థు పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఉషోదయ కూడలి సమీపంలో జరిగింది. ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాల మేరకు.. ఉషోదయ కూడలిలోని రెడ్ వెల్వెట్ వెనుక నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్థులో పనిచేస్తున్న సీహెచ్ అప్పలనాయుడు (35) ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు.

కేజీహెచ్‌కు తరలించే సరికి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడిది శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఎలుపురాయి గ్రామం.

శివాజీపాలెం ఆరుకొళాయిల కూడలిలో నివాసముంటున్నాడు. భార్య విజయ ఫిర్యాదు మేరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సంపత్ వినాయగర్‌ను దర్శించుకున్న ఒడిశా గవర్నర్


గవర్నర్ హరిబాబు దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

సిరిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆశీల్‌మెట్టలో గల సంపత్ వినాయక ఆలయాన్ని ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు మోహన్ స్వామి ఆధ్వర్యంలో గవర్నర్ దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరిబాబు దంపతులకు గణనాథుడి చిత్రపటాన్ని బహూకరించి, స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.

మా భూములకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వండి

» కలెక్టర్‌కు ముదపాక రైతుల వినతి


కలెక్టర్‌ను వినతిపత్రం అందజేస్తున్న ముదపాక రైతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం ముదపాకలో భూ సమీకరణకు తీసుకున్న భూములకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వాలని పలువురు రైతులు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్‌ను కోరారు. గ్రామానికి చెందిన మహిళలతో కలిసి గురువారం కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం అందజేశారు. ముదపాక సర్వే నంబర్లు 1, 38, 66, 75, 76, 80, 82, 83లో నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని, ఇదే సమయంలో మరికొందరు తోటలు పెంచుకున్నారన్నారు. పట్టా భూములు, ఆక్రమిత భూములపై ఆధారపడి జీవించేవారమన్నారు. గత ప్రభుత్వం 2019లో భూ సమీకరణకు గ్రామాన్ని ఎంపికచేశారని, భూముల కొలతలపై వ్యత్యాసాలు ఉన్నట్టు అధికారులు పేర్కొనడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. అప్పటికే తోటలు తొలగించి చదును చేయడంతో ఫలసాయం అందక ఆర్థికంగా కుదేలయ్యామన్నారు. ఈ నేపథ్యంలో భూ సమీకరణ ద్వారా తీసుకున్న భూములకు ఎకరాకు డీపట్టాకు 900గజాలు, ఆక్రమణదారులకు 450 గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాట్లకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వాలని కోరారు. హైకోర్టుల దాఖలు చేసిన పిటిషన్లు ఉపసంహరించుకుంటామని పేర్కొన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం జేసీ మయూర్ అశోక్‌కు రైతులు వినతి పత్రం అందజేశారు.

ఆర్టీసీ డిపోల్లో 'స్వచ్ఛతా హి సేవ'


వాల్తేర్ ఆర్టీసీ డిపో ఆవరణల్లో శ్రమధానం చేస్తున్న అధికారులు,సిబ్బంది

ద్వారకాబస్‌స్టేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆర్టీసీ డిపోలు, గ్యారేజీల్లో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కోసం గురువారం శ్రమదానం చేశారు. వాల్తేరు డిపోలో జరిగిన ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు పాల్గొని శ్రమదానం చేసి చెత్తను ఊడ్చారు. ఇతర అధికారులు, సిబ్బంది ఆయన్ని అనుసరించారు. డిపో మేనేజర్ కె.సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్ నాగభూషణ్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ దొర, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొని శ్రమదానం చేశారు.

అమ్మవారికి సారె సమర్పణ


సారెను తీసుకొని ఆలయానికి చేరుకున్న మహిళలు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు పాత వెంకోజీపాలెం శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో హెచ్‌బీ కాలనీలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని మహిళలు గురువారం రాత్రి దుర్గా అమ్మవారికి సారెను సమర్పించారు. ప్రతి ఇంటికి కిలో పావు, ఆపైన స్థోమతను బట్టి మిఠాయిలు, పండ్లు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కోలాటం సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని వీధుల్లో ఊరేగించి, అనంతరం సారెను అమ్మవారికి సమర్పించారు. శుక్రవారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో ఈ సారెలో తీసుకొచ్చిన మిఠాయిలను ఉపయోగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఒమ్మి ముత్యాలరాజు, పెద్దలు పల్లా చిన్నారావు, అప్పలరాజు, యువకులు, గ్రామస్థులు, పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మల్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం రామకృష్ణపురం లో చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌పీసీఎల్‌లో పనిచేసేందుకు బిహార్ నుంచి నలుగురు వ్యక్తులు వచ్చి, రామకృష్ణపురంలో ఉంటున్నారు. వీరిలో ముగ్గురు విధుల్లో చేరగా మహ్మద్ షకీల్ (22) ఖాళీగా ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం ఒంటరిగా ఉన్న సమయంలో ఫ్యాన్ హుక్కుకు లుంగీతో ఉరివేసుకున్నాడు. విధుల నుంచివచ్చిన మిత్రులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి మల్కాపురం పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా సకీల్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

స్టీల్‌ప్లాంట్‌లో క్యూసీఎఫ్ఐ సదస్సు ప్రారంభం

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్థల ప్రగతిలో క్వాలిటీ సర్కిల్ ముఖ్య పాత్ర పోషిస్తుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీం జి పురుషోత్తమన్ అన్నారు. ఉక్కు క్లబ్ ఎంపీ హాల్‌లో గురువారం ఆత్మనిర్భర్ వికసిత్ భారత్ కోసం నాణ్యత భావనలు ఇతివృత్తంలో క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో క్వాలిటీ కాన్సెప్ట్ -2025 అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాలిటీ సర్కిల్ ఉద్యోగుల ప్రమేయం, సమష్టి కృషి, నిరంతర మెరుగుదలను ప్రోత్సహిస్తుందన్నారు. ఏటీసీ టైర్ ఏపీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ బి.ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ సర్కిల్స్‌లో తమ ప్లాంట్ అత్యుత్తమంగా మారిందన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ మాట్లాడుతూ విద్యుత్, ఇంధన రంగం సమృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో క్యూసీఎఫ్ఐ విశాఖ చాప్టర్ ఛైర్మన్ జి.గాంధీ, కార్యదర్శి సాగర్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో అయేషాకు రజతం


పతకంతో అయేషా

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత జూనియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన అయేషా భాను రజత పతకం సాధించింది. గుంటూరులో గురువారం జరిగిన బాలికల హేమర్ త్రో ఈవెంట్‌లో అయేషా బాను రాణించి రజత పతకం సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పతక విజేత అయేషా, కోచ్ పిట్లా శ్రీనివాస్‌లను జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు అభినందించారు.

హోమ్‌కు వృద్ధుడి తరలింపు

సీతంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 70 ఏళ్ళ వ్యక్తి రోడ్డుపై పడి ఉండడం చూసి విధుల్లో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ దేవి కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. అతనికి పోలీసు సిబ్బంది సపర్యలు చేసి హోమ్‌లో చేర్పించారు. వృద్ధుడిది విజయనగరమని, కొడుకులు వైద్యం చేయించలేక రోడ్డుపై వదిలేసినట్టు సమాచారం.

24వ వార్డులో స్వచ్ఛతా హి సేవా

సీతమ్మధార, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సీతమ్మధార టీపీటీ కాలనీలో గల బృందావన్ పార్కులో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్కు కమిటీ ప్రతినిధులు కూడా కార్యక్రమంలో పాల్గొని పార్కును శుభ్రం చేశారు.కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది కోట రమణ, పార్కు ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు మానసిక రోగి

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్ నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న మానసిక రోగి సుకుమార్ రూయ్ దాస్ (50)ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన అతని 15 ఏళ్లుగా మానసిక ఆరోగ్యం బాగోలేదని, భార్యతో గొడవ పడి ఊరొదిలి వచ్చేశాడని చెప్పారు. మేలో రెస్క్యూ చేసిన ఏయూటీడీ సిబ్బంది షెల్టర్‌కు తరలించి వైద్యం అందించగా కోలుకోవడంతో గ్రామంలో ఉన్న తల్లి, భార్య తమ్ముడికి శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు క్షేమంగా అప్పగించినట్టు వాసు తెలిపారు.

28న మెగా రక్తదాన శిబిరం

అల్లిపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతి సందర్భంగా ఈనెల 28న నీలం వేప చెట్టు వద్ద జీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఫౌండేషన్ ప్రతినిధి ఆకుల రాజు తెలిపారు.

అంగటి దిబ్బలో అన్న సమారాధన

మహారాణిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహారాణిపేట అంగటి దిబ్బలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. రెండు వేల మంది భక్తులు ప్రసాదం స్వీకరించారు. 29వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ఉరుకూటి గణేశ్, జనసేన అధ్యక్షుడు అంగటి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బుద్దల అనురాధ, బంగారు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఐదో జోన్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- అండగా నిలుస్తున్న ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది



రవీంద్రనగర్‌లో ఇలా... శ్రీనివాసనగర్‌లో సెట్ బ్యాక్స్ లేకుండా

కంచరపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ఐదో జోన్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. భవన నిర్మాణానికి మంజూరు చేసిన ప్లాన్ ఒకటి, చేపడుతున్న నిర్మాణం విరుద్ధంగా ఉండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించకుండా, సెట్ బ్యాక్స్ విడిచి పెట్టకుండా నిర్మాణాలు చేపడుతున్నా సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. వార్డు ప్లానింగ్ సెక్రటరీని సంప్రదించి పనులు ప్రారంభిస్తే ఇబ్బంది రాకుండా తామే చూసుకుంటామని పలు చోట్ల నిర్మాణదారులకు హామీలు ఇస్తుండడం గమనార్హం. సిబ్బంది ఉల్లంఘనులకు' వత్తాసు పలకడంతో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. జోన్ పరిధి 48, 54, 55, 56, 57 వార్డుల్లో పలు చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా సిబ్బంది, అధికారులు కన్నెత్తి చూడకడడం లేదు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి రవీంద్రనగర్‌లో ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని సందులో ఓ వ్యక్తి తీసుకున్న ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణం చేపట్టాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో తూతూమంత్రం చర్యలు చేపట్టడంతో, నిర్మాణదారుడు పనులు పూర్తి చేశారనే విమర్శలున్నాయి. 48వ వార్డు న్యూ శ్రీనివాసనగర్‌లో రోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న భవనానికి సెట్ బ్యాక్స్ లేవు. 55వ వార్డు అశోక్‌నగర్ సర్వే నంబరు 33లో గెడ్డను ఆక్రమించి నిర్మాణం జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నా చర్యలు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ కమిషనర్ దృష్టి సారించి అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మారిన ధరలపై అవగాహన కల్పించాలి: జేసీ



మహారాణిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల ప్రభావంతో మారిన ధరలపై వినియోగ దారులకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుబజార్లు, రేషన్ దుకాణాలు, ఆర్టీసీ, హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థల పరిధిలో ఉన్న చర్యలపై సమీక్షించారు. జీఎస్టీ సంస్కరణలకు అనుగుణంగా క్షేత్రస్థాయి చర్యలు ఉండాలన్నారు. అధికారులు, వినియోగదారులు, సంక్షేమ సంఘాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆహార భద్రత, తూనికలు, కొలతలు, పౌర సరఫరాల శాఖాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా గురువారం సాయంత్రం మరోసారి నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడుతూ అర్బన్, రూరల్ ఏరియాలో ఎల్‌పీజీ గ్యాస్ సమస్యలు, రైతుబజార్లు, ఫుడ్ సేఫ్టీ ఇతర శాఖలలో సమస్యలపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాలు, రాష్ట్ర పన్నులు, ఈపీడీసీఎల్, తూనికలు, కొలతలు, గ్రామీణ నీటి సరఫరా, ఆర్టీసీ , స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి


మాట్లాడుతున్న బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన రామకృష్ణం రాజు

సీతంపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చిన్న వయసులోనే పొదుపు అలవాటు పెంపొందించుకోవాలని ది మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వ్యవస్థాపకులు మంతెన రామకృష్ణంరాజు పేర్కొన్నారు. ద్వారకానగర్ బీవీకే కళాశాలలో సహకార రంగం ప్రాముఖ్యతని, ప్రాథమిక స్థాయి, గ్రామ స్థాయి యువతీ యువకులకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణం రాజు మాట్లాడుతూ సహకార రంగాన్ని బలోపేతం చేయడానికి నవంబరు 8, 9 తేదిల్లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కో ఆపరేటివ్ కుంభ్ 2025 సదస్సు నిర్వహిస్తున్నారని, దానిలో యువత పాత్ర కీలకమన్నారు. జాయింట్ రిజిస్ట్రార్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి టి.ప్రవీణ ప్రైవేట్ రంగానికి కో ఆపరేటివ్ రంగానికి మధ్య ఉన్న తేడాలను వివరించారు. విద్యార్థుల ఆధ్వర్యంలో కొత్త వ్యాపార ఆలోచనలకు ప్రోత్సాహం, వ్యాపారవేత్తగా ఎదగడానికి సహకార బ్యాంకుల, సహకార రంగాల సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్న శేఖర్, బ్యాంక్ అధికారులు ఎస్ఎన్ సత్యనారాయణ, ఎం.మురళి కృష్ణ వర్మ, పిఎస్ఎల్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయం ఎదుట చిరు వ్యాపారుల ధర్నా


జడ్సీ రాముకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

జ్ఞానాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తోపుడు బళ్ల, చిరు వ్యాపారులపై జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్ పేరుతో చేస్తున్న దాడులను తక్షణమే నిలిపి వేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు కంచరపాలెం ఊర్వశి, మర్రిపాలేనికి చెందిన చిరు వ్యాపారులు, తోపుడు బళ్ల వ్యాపారులతో కలిసి జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారం రోజులుగా అధికారులు చిరు వ్యాపారులను లక్ష్యంగా చేసుకొని బడ్డీలు, దుకాణాలు తొలగిస్తున్నారని, తక్షణమే వాటిని ఆపాలన్నారు. అనంతరం జడ్సీ బొడ్డేపల్లి రాముకు వినతిపత్రం అందజేశారు. జడ్సీ మాట్లాడుతూ రోడ్లపై తోపుడు బళ్ల వ్యాపారులకు ఎటువంటి ఆంక్షలు విధించలేదని, కేవలం ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉన్న వాటిని మాత్రమే తొలగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కంచరపాలెం జోన్ కార్యదర్శి అప్పారావు, నాయకులు మూర్తి, శ్రీనివాసరావు, ఎల్లాజీ, ఎస్. చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు ఉన్నతాధికారులతో సీపీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న అధికారులు

మహారాణిపేట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దసరా రోజున నగరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీ శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం పోలీసు ఉన్నతాధికారులు, ఏడీసీపీలు, సీఐలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్టేషన్ పరిధిలో యాక్టివ్‌లో ఉన్న రౌడీ షీటర్లు, వారిపై నిఘా చర్యలను ఆరా తీశారు, పెండింగ్‌లో ఉన్న కేసులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు, ఎక్కడా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోక్సో కేసుల వివరాలను ఆరా తీశారు. సమావేశంలో డీసీపీలు మేరీ ప్రశాంతి, లతా మాధురి, కృష్ణకాంత్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్‌లో విద్యుదీకరణ పనుల పరిశీలన


పనులు తనిఖీ చేస్తున్న సీఆర్ఎస్ బ్రిజేష్ కుమార్ మిశ్రా, డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాయగడ, విజయనగరం మధ్య డబల్ లైను నిర్మాణ ప్రాజెక్టులో భాగంగా బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం స్టేషన్ల మధ్య కొత్తగా విద్యుద్దీకరించిన 14 కిలోమీటర్ల మేర మూడవ లైనును సౌత్ ఈస్టర్న్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ (సీఆర్ఎస్) బ్రిజేష్‌కుమార్ మిశ్రా తనిఖీ చేశారు. గురువారం పర్యటించిన ఆయన 25టీ యాక్సిల్ లోడ్‌కు అనుగుణంగా కొత్తగా నిర్మించిన పట్టాలు, వంతెనలు, వక్రతలు పరిశీలించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన స్టేషన్ యార్డులు, క్రాస్ ఓవర్లు, హై లెవెల్ ప్లాట్ ఫామ్‌లు, వంతెనలను తనిఖీ చేసి పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. అలాగే స్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యాలు, పార్శిల్ కార్యాలయం నిర్వహణ పనితీరును పరిశీలించారు. ఈ పర్యటనలో డీఆర్ఎం లలిత్ బొహ్రా, ఇతర అధికారులు అంకుష్ గుప్తా, అశోక్‌కుమార్, ఎస్‌కె.పాత్రో తదితరులు పాల్గొన్నారు.

వాల్తేరు డివిజన్ నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం విజయనగరం రైల్వేస్టేషన్ వద్ద చేపట్టిన పారిశుధ్య పనుల్లో డీఆర్ఎం లలిత్ బొహ్రా పాల్గొని శ్రమదానం చేశారు. అనంతరం అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులతో 'ఒక రోజు, ఒక గంట, అందరు కలిసి' అనే నినాదాన్ని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధికారులు మోహరానా, ఎ.అవినాష్, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ లంగ్స్‌కు తాత్కాలిక విరామం

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాల తొలగింపునకు జీవీఎంసీ ప్రారంభించిన 'ఆపరేషన్ లంగ్స్'కు శుక్రవారం నుంచి తాత్కాలికంగా విరామం ఇచ్చినట్టు చీఫ్ సిటీప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. దసరా నేపథ్యంలో వ్యాపారుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దసరా తర్వాత తిరిగి ప్రారంభిస్తామన్నారు. ఈ సమయాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకుని, రోడ్లు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటుచేసిన దుకాణాలను స్వయంగా తొలగించుకోవాలని కోరారు. దుకాణాలను కోల్పోయిన వ్యాపారులకు నగరంలో ఏర్పాటు చేసే స్ట్రీట్ వెండింగ్ జోన్స్‌లో దుకాణాలు పెట్టుకునేందుకు అవకాశం కల్పిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి రూ.1,10,000 విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన జీబారత్న మాజీ (40) గంజాయి రవాణా చేస్తు పట్టుబడ్డాడని, అతని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి పూజలు


సీతమ్మధారలో ప్రత్యానగిరి దేవిగా...


కంచరపాలెంలో కాత్యాయినిగా...


శ్రీకృష్ణుడి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

సీతమ్మధార, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి ఆలయంలో ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న దేవీశరన్నవరాత్రి పూజలు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవిని ప్రత్యానగిరి దేవిగా, వేంకటేశ్వర స్వామిని రామావతారంలో అలంకరించారు. భక్తులు దర్శించుకున్నారు.

48వ వార్డులో...

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఎల్బీ నగర్‌లో హంస కొండమ్మ భవానీ ఆధ్వర్యంలో గురువారం కాత్యాయినీదేవిగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో కర్రి రామారెడ్డి దంపతులు పాల్గొన్నారు. కంచరపాలెం, తిక్కవానిపాలెం, దుర్గానగర్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకపూజలు జరిగాయి.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో...

మహారాణిపేట: వన్‌టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు గురువారం ఉడిపి శ్రీకృష్ణుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మూల విరాట్‌కు పాలు, పెరుగు, గంధం, పసుపు కుంకుమ, పళ్లరసాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం పలు రకాల పూలతో అమ్మవారిని శ్రీకృష్ణుడిగా (ఉడిపి) అలకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులకు దర్శనాలు కల్పించారు. సాయంత్రం 200 మంది మహిళలతో కుంకుమార్చన, హోమం చేయించారు,

రెండు సంస్థలతో ఈపీడీసీఎల్ ఎంఓయూలు


ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థతో ఎంఓయూ పత్రాలు మార్చుకుంటున్న సీఎండీ పృథ్వీతేజ్. పక్కన ఇతర అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో ఎనర్జీ ట్రాన్సిషన్‌ను వేగవంతం చేసేందుకు ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) గురువారం రెండు కంపెనీలతో అవగాహన ఒప్పందం చేసుకుంది. కొత్తగా ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్‌తో వ్యవహారాలు నడిపేందుకు ఫ్లూయెంట్ గ్రిడ్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ (సీసీఎఫ్) సంస్థలు ముందుకువచ్చాయి. విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ ఆధునికీకరణ, డీకార్బనైజేషన్, కొత్త స్టార్టప్‌ల గుర్తింపు, ప్రోత్సాహం వంటివి సీసీఎఫ్ చేపడుతుంది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో స్మార్ట్ గ్రిడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఫ్లూయెంట్ గ్రిడ్ పైలట్ ప్రాజెక్టుగా చేపడుతుంది. ఎంఓయూలు చేసిన సందర్భంగా ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ, పునరుత్పాదక రంగంలో ఈ ఒప్పందాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్లూయెంట్ గ్రిడ్, సీసీఎఫ్ ప్రతినిధులతో పాటు ఈపీడీసీఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ చంద్రం, సీజీఎం డి. సుమన్ కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓ ఆనంద్‌కుమార్‌పై విచారణకు లోకాయుక్త సిఫారసు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో మొన్నటి వరకు పనిచేసి ఇప్పుడు కనకమహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ అయిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఏఈఓ) ఆనంద్‌కుమార్ అదనపు ఆదాయంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలంటూ దేవదాయ శాఖ కమిషనర్‌కు లోకాయుక్త సిఫారసు చేసింది. గాజువాకకు చెందిన దొడ్డి రమణ ఆనంద్‌కుమార్ అక్రమ వ్యవహారాలపై లోకాయుక్తకు నెల క్రితం ఫిర్యాదు చేశారు. ఆనంద్‌కుమార్ దీర్ఘకాలంగా సింహాచలం దేవస్థానంలో ఏఈఓగా పనిచేస్తున్నారని, బదిలీలు ఆపుకుంటున్నారని, భక్తులు ఇచ్చే విరాళాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. తాళ్లపాలెం సమీపానున్న చిన్నమల్లం గ్రామంలో 'విశ్వజ్ఞానుల విజ్ఞాన విహార క్షేత్రం' పేరుతో ఆశ్రమాన్ని బినామీల పేరుతో నడుపుతున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. సింహాచలంలో భక్తులను ఏమార్చి, వారిచ్చే విరాళాలను ఆశ్రమానికి తరలించారని పేర్కొన్నారు. ఈఈ శ్రీనివాసరాజుతో కలిసి అవినీతి పనులు చేస్తున్నారని, చందనోత్సవ సమయాల్లో అదనపు టికెట్లు ముద్రించి అధిక రేట్లకు అమ్ముకుంటున్నారని ఫిర్యాదు చేశారు. వీటిపై స్పందించిన లోకాయుక్త చందనోత్సవంపై ప్రభుత్వం విచారణ చేస్తున్నందున దానిపై మళ్లీ విచారణ అవసరం లేదని పేర్కొంది. అయితే అక్రమ సంపాదన తేల్చడానికి, ఆదాయానికి మించిన ఆస్తులు ఉంటే చర్యలు తీసుకోవాలని సూచిస్తూ దేవదాయ శాఖ కమిషనర్‌కు సిఫారసు చేసింది. ఈ ఆదేశాలు వచ్చి నెల రోజులు కావస్తున్నా..ఇంకా ఎటువంటి విచారణ ప్రారంభం కాకపోవడం గమనార్హం. సింహాచలం దేవస్థానం అధికారులపై ఎటువంటి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినా కమిషనర్ కార్యాలయం వద్దనే నీరుగారిపోతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో తప్పక విచారణ చేయిస్తున్నా ఎవరిపైనా చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఏయూలో ఉద్రిక్తత

... 3వ పేజీ తరువాయి

పట్టించుకోకపోవడం వల్లే ఇప్పుడు మణికంఠ మరణించాడని ఆరోపించారు. అంతా వర్సిటీ ప్రధాన గేటు వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ఆందోళనకు దిగారు. సుమారు 18 సార్లు ఈ సమస్య వీసీ దృష్టికి తీసుకువెళ్లామని, ఆయన పట్టించుకోలేదని, తక్షణమే ఆయన పదవికి రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. మరణించిన మణికంఠ కుటుంబానికి న్యాయం చేయాలని, కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని కోరారు. వీసీ రాజశేఖర్ అక్కడికి వచ్చి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే విద్యార్థి నాయకులు దీనికి సంతృప్తి చెందలేదు. డిస్పెన్సరీలో వైద్యం అందకపోవడానికి బాధ్యులైన వారిని సస్పెండ్ చేయాలని, తక్షణమే వైద్యసదుపాయాలు కల్పించాలని, వీసీ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు. ఇలా ఈ ఆందోళన తీవ్రరూపం దాల్చి...సుమారు 50 మంది విద్యార్థులు వీసీ ఛాంబర్‌లోకి దూసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో వారిని ప్రొఫెసర్లు, పోలీసులు అడ్డుకొని వీసీకి రక్షణ కల్పించారు. విద్యార్థుల సమస్యలు పట్టించుకోని మీకు వీసీగా ఉండే అర్హత లేదని, రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఎట్టకేలకు పోలీసులు మరింత మంది వచ్చి వారిని బయటకు తీసుకువచ్చారు.

కేజీహెచ్‌కు వెళ్లి వైద్యులతో వీసీ చర్చలు

మణికంఠ మృతదేహానికి పోస్టుమార్టం చేయకుండా తమకు ఇవ్వాలని తండ్రి శ్రీనివాసరావు కేజీహెచ్ వైద్యులను కోరారు. వీసీ వచ్చి చెబితే తప్ప తాము ఏమీ చేయలేమని వైద్యులు చెప్పడంతో వారు యూనివర్సిటీకి వచ్చి వీసీని కలిశారు. కేజీహెచ్‌కు రావాలని కోరారు. పోలీసుల సాయంతో వీసీ కేజీహెచ్‌కు వెళ్లి చర్చలు జరిపారు. మణికంఠ మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని, దానికి ఎవరూ బాధ్యులు కారని రాతపూర్వకంగా ఇస్తే పోస్టుమార్టం లేకుండా మృతదేహాన్ని ఇస్తామని వైద్యులు చెప్పడంతో తండ్రి శ్రీనివాసరావు అక్కడికక్కడే లేఖ రాసి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణికి ఇచ్చారు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కూడా ఓ లేఖ ఇవ్వడంతో వైద్యులు మృతదేహాన్ని ఇవ్వడానికి రాత్రి ఏడు గంటలకు అంగీకరించారు.

కొవ్వొత్తులతో నివాళి

వీసీ రాజశేఖర్ కేజీహెచ్‌కు వెళ్లిన తరువాత కూడా విద్యార్థులు ఏయూలో ఆందోళన కొనసాగించారు. రాత్రి ఏడు గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు వారితో చర్చించారు. డిస్పెన్సరీలో తక్షణమే వసతులు కల్పిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే వీసీ రాజీనామా చేయాల్సిందేనని విద్యార్థులు పట్టుబట్టారు. దీనిపై ఆరోగ్యశాఖ మంత్రికి, డిప్యూటీ సీఎంకు, గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శుక్రవారం యూనివర్సిటీ బంద్‌కు పిలుపునిచ్చారు. రాత్రి 7.30 గంటకు ఆందోళన విరమించారు.

ఏసీబీకి చిక్కిన సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్

... 3వ పేజీ తరువాయి

మండల తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వేయర్ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. మిగతా సిబ్బంది నుంచి కూడా ఫోన్‌లు తీసుకొని.. తరువాత తిరిగి ఇచ్చేశారు. సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లను అవినీతి నిరోధశాఖ సెక్షన్‌ప్రకారం 2018 సెక్షన్ 7 కింద అరెస్టు చేశారు. శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు.

ఆధార్‌తో వాహనాల అనుసంధానం

... 3వ పేజీ తరువాయి

వాహనాలు, ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన వాహనాలు, పెద్దపెద్ద ట్రాన్స్‌పోర్టు కంపెనీల వాహనాలకు ఆధార్ నంబరుతో అనుసంధానం చేయడం అంత సులువు కాదని సచివాలయ ఉద్యోగి ఒకరు అభిప్రాయపడ్డారు. మిగతా వాహనాలకు సంబంధించి ఆయా కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, ట్రాన్స్‌పోర్టు కంపెనీలకు ప్రత్యేకించి లేఖలు రాసి వివరాలు తీసుకోవాల్సి ఉంటుంది. తూర్పు నావికాదళానికి చెందిన వాహనాలు అనుసంధానం చేయడానికి జిల్లా యంత్రాంగం ద్వారా ప్రయత్నించాల్సి ఉందని పేర్కొంటున్నారు.

7 నుంచి కొత్త జోన్లు

... 3వ పేజీ తరువాయి

మంచి రోజు కావడంతో ఆరోజు నుంచి కొత్తజోన్‌ల పాలన ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని సూచించినట్టు అధికారులు చెబుతున్నారు. అలాగే జోన్‌లను కూడా నంబర్లతో కాకుండా నియోజకవర్గాల పేర్లతోనే పిలిచేలా పునర్వ్యవస్థీకరించారు. కొత్తగా భీమిలి జోన్‌లో గతంలో మాదిరిగా నాలుగు వార్డులు ఉంటే, భీమిలి నియోజకవర్గంలో ఏర్పాటయ్యే రెండోజోన్‌కు మధురవాడ జోన్‌గా, జోన్-3 కార్యాలయాన్ని ఇకపై తూర్పు జోన్ కార్యాలయంగా, జోన్-4 కార్యాలయాన్ని సౌత్‌జోన్‌గా, జోన్-5 కార్యాలయాన్ని పశ్చిమ జోన్‌గా, జోన్-6ని గాజువాక జోన్‌గా, జోన్-7ని అనకాపల్లి జోన్‌గా మార్చారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని జోన్-8ని పెందుర్తి జోన్‌గా మార్చి, అదే నియోజకవర్గ పరిధిలో కొత్తగా ఏర్పాటయ్యే జోన్‌కు అగనంపూడి జోన్‌గా పేరుమార్చారు. ప్రస్తుతం ఉన్న అన్ని జోన్‌ల కార్యాలయాలకు భవనాలు ఉండగా నార్త్‌జోన్‌తోపాటు అగనంపూడి జోన్‌లకు మాత్రం కార్యాలయాల కోసం కొత్త భవనాలను గుర్తించాల్సి ఉండడంతో అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. కొత్తగా ఏర్పాటయ్యే పది జోన్‌లలో గాజువాక జోన్ 108.11 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో అతిపెద్దజోన్‌గా మారగా, 102.830 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో అగనంపూడి జోన్ రెండో అతిపెద్దగా జోన్‌గా, 9.698 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో సౌత్‌జోన్ అత్యంత చిన్నజోన్‌గా మారింది.


భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు

సీతమ్మధార, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నక్కవానిపాలెంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బోనాలను ఊరేగించారు. భవాని భక్తులు, కమిటీ ప్రతినిధులు, మహిళలు తలపై బోనాలు పెట్టుకొని దీపాలతో ఏడు గుళ్ల ముత్యాలమ్మవారి ఆలయం వద్ద చేరుకున్నారు. రంగారెడ్డి, ప్రశాంత్‌కుమార్, పండుయాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అగనంపూడి కేంద్రంగా జోన్-9

జీవీఎంసీ కార్యాలయం ఏర్పాటు కానుండడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అగనంపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) 77, 78, 79, 85 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడి, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం, ఉక్కునగరం, అప్పికొండ, పాలవలస, ఇస్లాంపేట ప్రాంతాలకు అగనంపూడి కేంద్రంగా జోన్-9 ఏర్పాటు చేస్తుండడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పాలనా సౌలభ్యం పేరిట నియోజకవర్గాల వారీగా జోన్లను ఏర్పాటు చేసి జీవీఎంసీ కౌన్సిల్‌లో చేసిన తీర్మానానికి రాష్ట్ర ప్రభుత్వం



అగనంపూడి వ్యూ..

ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుతం ఎనిమిది జోన్లుగా ఉన్న జీవీఎంసీ పది జోన్లుగా మారనున్నది.. గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న 77, 78, 79, 85 వార్డులను పెందుర్తి జోన్-2 కేంద్రంగా ఏర్పాటు చేయాలని అధికారులు తొలుత ప్రతిపాదించారు. అయితే ఈ ప్రాంత ప్రజలంతా సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెందుర్తి జోనల్ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఈ విషయమై 'పెందుర్తి జోన్‌లో విలీనంపై మండిపాటు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమవ్వడంతో పాటు స్థానిక నాయకులు మంత్రి నారా లోకేశ్, ఎంపీ శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అధికారులు జోన్-9ను అగనంపూడి కేంద్రంగా ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు. 77, 78, 79, 85 వార్డుల ప్రజలకు సౌలభ్యంగా సేవలందాలంటే అగనంపూడి కేంద్రంగా జోన్‌ను ఏర్పాటు చేస్తే బాగుటుందని భావించి అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. జోన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం లభించడంతో విజయదశమి తరువాత అగనంపూడి కేంద్రంగా జోనల్ కార్యాలయం ఏర్పాటు కానుండడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది



అగనంపూడి కేంద్రంగా జీవీఎంసీ జోన్-9ను ఏర్పాటు చేస్తుండడం వల్ల నాలుగు వార్డుల ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. గతంలో ఈ ప్రాంతాన్ని పెందుర్తి జోన్‌లో ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఈ విషయంపై అప్పట్లో కౌన్సిల్‌లో వ్యతిరేకించడంతో పాటు కమిషనర్, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్లాను. ఎట్టకేలకు జోన్ మార్పు చేసి అగనంపూడిలో ఏర్పాటు చేస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది.

-ఇల్లపు వరలక్ష్మి, 85వ వార్డు కార్పొరేటర్

ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం



ఇది ప్రజా ప్రభుత్వం. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరికీ అందుబాటులో ఉండేలా అగనంపూడి కేంద్రంగా జీవీఎంసీ జోన్-9 కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తుండడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. జోన్ సమస్యపై తాము కమిషనర్‌తో పాటు ప్రజాప్రతినిధులకు కలిసి వివరించాం. మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం. ఆయన స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం హర్షణీయం.

-కర్రి దశేంద్ర, టీడీపీ 85వ వార్డు అధ్యక్షుడు

మా భూములకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వండి

» జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ముదపాక రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదపాక రైతులు

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండలం ముదపాకలో భూ సమీకరణకు తీసుకున్న భూములకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వాలని పలువురు రైతులు కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్‌ను కోరారు. గ్రామానికి చెందిన మహిళలతో కలిసి గురువారం కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రం అందజేశారు. ముదపాక సర్వేనంబర్లు 1,38,66,75,76,80,82,83లో నాలుగు దశాబ్దాల క్రితం ప్రభుత్వం తమకు పట్టాలు ఇచ్చిందని, ఇదే సమయంలో మరికొందరు తోటలు పెంచుకున్నారన్నారు. పట్టా భూములు, ఆక్రమిత భూములపై ఆధారపడి జీవించేవారమన్నారు. గత ప్రభుత్వం 2019లో భూ సమీకరణకు గ్రామాన్ని ఎంపికచేశారని, భూముల కొలతలపై వ్యత్యాసాలు ఉన్నట్టు అధికారులు పేర్కొనడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. అప్పటికే తోటలు తొలగించి చదునుచేయడంతో ఫలసాయం అందక ఆర్థికంగా కుదేలయ్యామన్నారు. ఈ నేపథ్యంలో భూ సమీకరణ ద్వారా తీసుకున్న భూములకు ఎకరాకు డీపట్టాకు 900గజాలు,ఆక్రమణదారులకు 450గజాల చొప్పున అభివృద్ధి చేసిన ప్లాట్లకు కన్వేయన్స్ డీడ్లు ఇవ్వాలని కోరారు. హైకోర్టుల దాఖలు చేసిన పిటిషన్లు ఉపసంహరించుకుంటామని పేర్కొన్నారు.దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం జేసీ మయూర్ అశోక్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు.

ట్రాఫిక్ నిర్వహణకు ఏఐ సాంకేతికత

» ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్



కలెక్టర్, సీపీతో కలిసి అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, నిర్వహణ సులభమైన పద్ధతిలో సాగాలని ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల రాకపోకలు, ప్రయాణాలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ఏఐ సాయంతో నాణ్యమైన పరిష్కారం కనుగొనాలని సూచించారు. స్మార్ట్ ట్రాఫిక్ సిగ్నల్ లింకు వ్యవస్థను అనుసరిస్తే చాలా వరకు నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని, నిర్వహణ సులభతరమవుతుందని అభిప్రాయపడ్డారు. వాహనదారుల ట్రాఫిక్ ఉల్లంఘన, అపరాధ రుసుం విధింపు, వసూళ్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి బృహస్పతి, అవిరోస్, ఆర్కడిస్,నయన్ సంస్థలు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చాయి. హైదరాబాద్, బెంగళూరు, ఇండోర్, లక్నో, ఢిల్లీ తదితర నగరాల్లో అవలంబిస్తున్న విధానాలు, సాంకేతిక సహాయంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నిబంధనల ఉల్లంఘనలపై కేసుల నమోదు తదితర అంశాలపై ఇటీవల చేపట్టిన పైలట్ ప్రాజెక్టు నమూనాలను వివరించారు. ఎయిర్‌పోర్టు, ఆర్కేబీచ్, బిర్లా జంక్షన్, పంజాబ్ హోటల్, ఆర్అండ్‌బీ జంక్షన్లలో ట్రాఫిక్ రద్దీపై సేకరించిన నమూనాలను ప్రదర్శించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ సాంకేతిక సహాయాన్ని సమృద్ధిగా వినియోగిస్తే ప్రమాదాలు తగ్గడంతోపాటు ప్రజల్లో పరివర్తన కలుగుతుందని తద్వారా ట్రాఫిక్ ఉల్లంఘనలు తగ్గుతాయన్నారు. దీనివల్ల ప్రజలు సులభంగా ప్రయాణాలు సాగించేలా ఆధునిక పద్ధతులు ఉండాలని పేర్కొంటూ ఆ దిశగా అధికారులు సాంకేతిక నిపుణుల సూచనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చేనెల తొలివారంలో జీవీఎంసీ నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ సిద్ధం చేయాలని సూచించారు. దీనిపై సూచనలు, సలహాలు స్వీకరించి అక్టోబరు నెలాఖరుకల్లా టెండర్లు ఆహ్వానించాలన్నారు.



సీపీ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న సిబ్బంది

పెందుర్తి క్రైమ్ పోలీసులకు సీపీ రివార్డులు

పెందుర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలను ఛేదించి, క్రైమ్ రేటును నియంత్రించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సీపీ రివార్డులు అందించారు. గురువారం నగర పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ శంఖబ్రత బాగ్చి, క్రైమ్ డీసీపీ లలితమాధురి చేతుల మీదుగా పెందుర్తి క్రైమ్ ఎస్ఐ డి.సూరిబాబు, హెచ్‌సీలు జి.నాగరాజు, వి.పేరయ్యనాయుడు, పీసీలు శివప్రసాద్, విజయ్‌కుమార్, దేముడుబాబు, సింహాచలం, తాతారావు చంద్రకళ రివార్డులు అందుకున్నారు. వారిని అభినందిస్తూ సీపీ ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఉక్కులో క్యూసీఎఫ్ఐ సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న డైరెక్టర్ పురుషోత్తమన్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సంస్థల ప్రగతిలో క్వాలిటీ సర్కిల్ ముఖ్య పాత్ర పోషిస్తుందని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ సలీం జి పురుషోత్తమన్ అన్నారు. ఉక్కు క్లబ్ ఎంపీ హాల్‌లో గురువారం ఆత్మనిర్భర్ వికసిత్ భారత్ కోసం నాణ్యత భావనలు ఇతివృత్తంలో క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ ఆఫ్ ఇండియా (క్యూసీఎఫ్ఐ) ఆధ్వర్యంలో క్వాలిటీ కాన్సెప్ట్ -2025 అంశంపై నిర్వహించిన సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాలిటీ సర్కిల్ ఉద్యోగుల ప్రమేయం, సమష్టి కృషి, నిరంతర మెరుగుదలను ప్రోత్సహిస్తుందన్నారు. ఏటీసీ టైర్ ఏపీ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ బి.ప్రహ్లాద్‌రెడ్డి మాట్లాడుతూ క్వాలిటీ సర్కిల్స్‌లో తమ ప్లాంట్ అత్యుత్తమంగా మారిందన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ మాట్లాడుతూ విద్యుత్, ఇంధన రంగం సమృద్ధికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో క్యూసీఎఫ్ఐ విశాఖ చాప్టర్ చైర్మన్ జి.గాంధీ, కార్యదర్శి సాగర్, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి

ఆటోనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో గురువారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 70వ వార్డు పరిధి ఎల్‌వీ నగర్‌లో బీజేపీ మండల అధ్యక్షురాలు దేనంకొండ పావని ఆధ్వర్యంలో, 86వ వార్డు శాతవాహన నగర్‌లో నాయకుడు బొండా శ్రీదేవి ఎల్లాజీరావు నేతృత్వంలో, భరత్ నగర్‌లో, 87వ వార్డు వడ్లపూడిలో బీజేపీ నాయకుడు లక్కరాజు సోంబాబు ఆధ్వర్యంలో అంత్యోదయ సిద్ధాంత కర్త దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని జరిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేనంకొండ కృష్ణంరాజు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడిగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపాధ్యాయ ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు వీరయ్య, గణపతిరాజు, శివాజీరాజు, తదితరులు పాల్గొన్నారు.


గాజువాక: జన్‌సంఘ్ పూర్వ అధ్యక్షుడు పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు విశేషనీయమని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. ఇక్కడి బీజేపీ కార్యాలయంలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగనాయకులు, అప్పారావు, వరలక్ష్మి, కృష్ణారెడ్డి, ఈశ్వరరావు, మహేశ్, ముసలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని బీజేపీ నగర ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయ్‌బాబు ప్రధాన కార్యదర్శి పోలిమేర శ్రీనివాసరావులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేందుకు దీనదయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయ సూత్రాన్ని ప్రతిపాదించారన్నారు. నాయకులు గురుమూర్తి, సత్యనారాయణ, పి.శ్రీనివాస్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఎంబీఏ విద్యార్థినులకు ఉద్యోగాలు

అగనంపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న 15 మంది విద్యార్థినులు 12 సంస్థల్లో రూ4.2 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా విజ్ఞాన్ విద్యా సంస్థలు విద్యార్థులకు తగిన శిక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగాధిపతి మనేంద్రసాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు



బడ్డీని తొలగిస్తున్న దృశ్యం

మల్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ అధికారుల ఆపరేషన్ లంగ్స్ హెచ్చరికల నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని ఫుట్‌పాత్‌లపై చిన్నచిన్న దుకాణాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వారిందరూ స్వచ్ఛందంగా తమ దుకాణాలను తొలగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ దుకాణాలే తమకు జీవనాధారంగా నిలిచాయని, ఇప్పుడు వీటిని తొలగిస్తున్నందున భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని పలువురు చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. చాలామంది దుకాణదారులు ఎక్కడ జీవీఎంసీ సిబ్బంది ఎక్స్‌కవేటర్లతో తమ షాపులను కూల్చివేస్తారోనన్న భయాందోళనతో స్వచ్ఛందంగా వాటిని తొలగిస్తున్నారు.

సీపీఐ నాయకుల ఆందోళన

ఫుట్‌పాత్‌లపై దుకాణాలను, తోపుడు బళ్లను జీవీఎంసీ అధికారులు తొలగిస్తుండడం దారుణమంటూ సీపీఐ నాయకులు మల్కాపురం మెయిన్ రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సత్యాంజనేయ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌పై వ్యాపారులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపాకే వారి దుకాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు గుడాల రాంబాబు, తోపుడుబండ్ల సంఘ నాయకులు రమేశ్, నూకరాజు, ఆర్.అప్పారావు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఎంతో మేలు

గాజువాక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే అన్ని విధాల మేలు జరుగుతుదని టీడీపీ 72వ వార్డు అధ్యక్షుడు అక్కిన లక్ష్మణరావు అన్నారు. వార్డులోని శ్రీనగర్ పార్కు వద్ద గురువారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాల్లో ఎక్కడా చెత్తాచెదారాలు వేయరాదని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరుచేసి పారిశుధ్య సిబ్బందికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, స్థానిక నాయకులు సత్యారావు, కన్నారావు, రామారావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ సెక్టార్-1లో ఉచిత వైద్య శిబిరం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ సెక్టార్-1లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించిన బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. సుమారు 200 మందికి వైద్యులు వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ఎన్.ఎ.డి.జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎన్ఏడీ సమీపంలోని మహతి కాలేజీలో క్లౌడ్ మేనేజ్‌మెంట్ కలెక్టివ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏఐ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ జీఎల్ఎన్‌రాజు, ప్రిన్సిపాల్ మధుసూదన్, క్లైమేట్ ఫౌండేషన్ సీఈవో ప్రతాప్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో 'స్వస్త్ నారీ సశక్త్'

గోపాలపట్నం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ వైద్య పరీక్షలతో పాటు గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, డెర్మటాలజీ, పిడియాట్రిక్ వైద్యులు రోగులకు టెస్టులు చేసి మందులు పంపిణీ చేశారు.

సినిమా గైడ్

● ఓజి : మెలోడి, శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, శరత్, లీలామహల్, శ్రీరామ, కిన్నెర, కామేశ్వరి, గోకుల్, వెంకటేశ్వర-1,2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)

● మిరాయి: లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-1(పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● కిష్కిందపురి : శ్రీరామా, నరసింహ (గోపాలపట్నం), (గాజువాక),

● ఘాటీ : గోకుల్, ముక్తాస్, (గాజువాక)

● మహావతార్ నరసింహ : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 24, పచ్చిమిర్చి 36, కాకరకాయలు 28, బీరకాయలు 34, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 16, క్యారెట్ 44, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది) 70, బరబాటి 34, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 54, కీరదోస 32, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 32, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 80, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	115
లైవ్ ధర	130
విత్ స్కిన్	240
స్కిన్‌లెస్	250

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్

» పలుచోట్ల ఏక్ దిన్-ఏక్ సాథ్-ఏక్ గంటా కార్యక్రమాల నిర్వహణ



తిరుమలనగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న బొండా జగన్, కిరణ్‌కుమార్, తదితరులు



62వ వార్డు ప్రకాశ్‌నగర్‌లో రోడ్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, జోన్-6 ఏఎంవోహెచ్ కిరణ్‌కుమార్‌లు అన్నారు. 87వ వార్డు తిరుమల నగర్‌లో గురువారం కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏక్ దిన్-ఏక్ సాథ్-ఏక్ గంటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలోని పార్కుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలను తొలగించారు. రహదారులను శుభ్రం చేయడంతో పాటు పలుచోట్ల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జగన్, కిరణ్‌కుమార్‌లు మాట్లాడుతూ అందరూ నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదని కోరారు. కాలుష్య నివారణకు మొక్కలు నాటాలన్నారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జి.విశ్వేశ్వరరావు, పరమానందం, పరమేశ్వరరావు, సన్యాసిరావు, వసంతరెడ్డి, డాక్టర్ ప్రభుదాస్, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, రాజానరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: గ్రేటర్ 89వ వార్డు పరిధి చంద్రనగర్‌లో ఏక్ దిన్-ఏక్ గంటా-ఏక్ సాథ్ కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. జడ్సీ శంకరరావు మాట్లాడుతూ ప్రజలంతా తమ పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి రోజూ గంట సమయాన్ని కేటాయించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య విభాగ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్కాపురం: గ్రేటర్ 58వ వార్డు పరిధి శ్రీహరిపురంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఏక్ దిన్-ఏక్ సాత్-ఏక్ గంటా కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిశుభ్రతపై దృష్టిసారించాలని కోరారు. మార్కెటింగ్ విభాగం డైరెక్టర్ పొత్తబత్తుల శ్రీనివాసరావు,సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉరుకూటి సతీశ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీహరిపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పీవీ సురేశ్, తదితరులు పాల్గొని పలు ప్రాంతాలను శుభ్రం చేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరాజ్, బీజేపీ నాయకురాలు వసుంధర, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి ప్రకాశ్‌నగర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో ఏక్ దిన్-ఏక్ సాత్-ఏక్ గంటా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయిడు, తదితరులు చీపుర్లతో పలు వీధులను శుభ్రం చేశారు. టీడీపీ నాయకురాలు ఆర్సీ ఆదిలక్ష్మి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 52వ వార్డు పరిధి మర్రిపాలెం వుడా లేవుట్‌లో గల పలు గ్రీన్ బెల్ట్ పార్కుల్లో స్వచ్ఛతోత్సవ్, స్వచ్ఛతాకి సేవా కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పాల్గొని చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుకు విచ్చేసే ప్రతి వాకర్ కూడా పీఎం మోదీ పిలుపు మేరకు గంటపాటు చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేస్తుండాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మల్కాపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రామకృష్ణాపురంలో చోటుచేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హెచ్‌పీసీఎల్‌లో పనిచేసేందుకు బిహార్ నుంచి నలుగురు యువకులు వచ్చి, రామకృష్ణపురంలో ఉంటున్నారు. వీరిలో ముగ్గురు విధుల్లో చేరగా మహ్మద్ షకీల్(22) ఖాళీగా ఉన్నాడు. ఈ క్రమంలో గురువారం ఒంటరిగా ఉన్న సమయంలో ఫ్యాన్ హుక్కుకు లుంగీతో ఉరి వేసుకున్నాడు. విధుల నుంచి వచ్చిన మిత్రులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా షకీల్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

మూడో అంతస్థు పైనుంచి పడి వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్థు పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఉషోదయ కూడలి సమీపంలో జరిగింది. ఏఎస్ఐ ఆదిరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉషోదయ కూడలిలోని రెడ్ వెల్వెట్ వెనుక నిర్మాణంలో ఉన్న భవనం మూడో అంతస్థులో పనిచేస్తున్న సీహెచ్ అప్పలనాయుడు (35) ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. కేజీహెచ్‌కు తరలించేసరికి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా రణస్థలం వద్ద ఎలుపురాయి గ్రామం. శివాజీపాలెం ఆరు కొళాయిల కూడలిలో నివాసముంటున్నాడు. భార్య విజయ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

గోపాలపట్నం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి బాగోలేని ఓ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొత్తపాలెం నాగేంద్రకాలనీకి చెందిన షేక్ సలీమా (39) అనే మహిళ కొద్ది నెలలుగా మానసిక అనారోగ్యంతో ఇబ్బంది పడుతుంది. ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా గురువారం వేకువజాము 4 గంటల సమయంలో సలీమా బయటకు వెళ్లిపోయింది. 5 గంటల సమయంలో ఆమె భర్త పీర్ సాహెబ్ మేల్కొని చూడగా భార్య కనిపించలేదు. ఆమె కోసం ఎంత గాలించినా ఫలితం లేకపోవడంతో పీర్ సాహెబ్ గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరు వ్యాపారుల నూతన కార్యవర్గం

వేపగుంట, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ జోన్-8 నాయకుల ఆధ్వర్యంలో నాయుడుతోట, వేపగుంట కూడళ్లలో ఉన్న చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వై.రాంబాబు, అధ్యక్షుడిగా పి.ఈశ్వరరావు, కార్యదర్శిగా పి.నాగరాజు, ఉపాధ్యక్షుడిగా శరత్‌కుమార్, అదనపు కార్యదర్శులుగా ప్రదీప్, నజీర్, కోశాధికారిగా ఈశ్వరరావుతో పాటు పలువురు సభ్యులుగా ఎన్నికయ్యారు.

పోరాట యోధుడు ఏబీ బర్ధన్‌కు నివాళి

పెదగంట్యాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత దివంగత ఏబీ బర్ధన్ పోరాట యోధుడని, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం వారి పక్షాన నిలిచి ప్రభుత్వాలపై పోరాటం చేసిన గొప్ప వ్యక్తి అని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్యనారాయణ అన్నారు. బర్ధన్ జయంతిని గురువారం స్థానిక పోతిన సన్యాసిరావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు బర్ధన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ బర్ధన్ ఆశయ సాధన కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెదపూడి దుర్గారావు, కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.పోతయ్య, కె.అచ్యుతరావు, టి.చంద్రశేఖర్, కె.మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: ఇక్కడి మెయిన్ రోడ్డులో గల గ్రామ మండలిలో ఏబీ బర్ధన్ చిత్రపటానికి సీపీఐ 'పశ్చిమ' కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బర్ధన్ ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని కోరారు. నాయకులు కనకేశ్వరరావు, రామకృష్ణ, కామేశ్వరరావు, సురేష్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: సీపీఐ పెందిర్తి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో వేపగుంట కూడలిలో ఏబీ బర్ధన్ జయంతిని నిర్వహించారు. ఏరియా సమితి కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలు, కార్మికుల హక్కుల సాధన కోసం బర్ధన్ అలుపెరగని పోరాటం చేశారన్నారు. సీపీఐ నాయకుడు రాంబాబు, చిరు వర్తకులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సామాజిక బాధ్యత

పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం

పెందుర్తి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్-2047 కలల సాకారం చేయడం సామాజిక బాధ్యత అని పీఏసీఎస్ చైర్మన్ అయితి సింహాచలం అన్నారు. 97వ వార్డు పులగాలిపాలెంలోని పాఠశాలలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమానికి సింహాచలం హాజరై స్కూల్ పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఆర్.బుజ్జి ఈశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ నూతన డీజీఎంకు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ ఐఆర్అండ్‌హెచ్ఆర్ విభాగం డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాధికను ఉక్కు కార్మిక సంఘ నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. కీలకమైన హెచ్ఆర్ విభాగంలో డీజీఎంగా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. సంస్థను మరింత ప్రగతిపథంలో నడిపించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, బి.శశిభూషణరావు, ప్రకాశరావు, గురునాథ్‌రెడ్డి, అప్పలరాజు పాల్గొన్నారు.